పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :301 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | గురువారం 5 నవంబర్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :301 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : TIRUPATI | THU 5 NOVEMBER 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



అమెరికాలో డెమోక్రాట్ల

ప్రభంజనం..

ట్రంప్‌కు భారీ షాక్!

- అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ ఘన విజయం
- ప్రతినిధుల సభ, సెనెట్ రెండింటినీ కైవసం చేసుకున్న డెమోక్రాట్లు
- రిపబ్లికన్ల ఆధిపత్యానికి గండికొట్టిన ఓటర్లు
- టెక్సాస్, జార్జియా, అయోవా సహా కీలక రాష్ట్రాల్లో పార్టీ పుంజుకుంది
- ట్రంప్ పాలనపై ప్రజల్లో అసంతృప్తే ఫలితాలకు కారణమని విశ్లేషణ

- మిగతా 2లో

ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నేడు
- ఎన్నికలపై ఎస్ఈసీ సమీక్ష.. కీలక ఆదేశాలు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పోలింగ్‌కు పెద్దగా ఇబ్బందులు ఉండబోవని ఆయన తెలిపారు. బుధవారం విజయవాడలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరపాలని, ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లకు, సిబ్బందికి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ, పోలింగ్ విధుల్లో 2.52 లక్షల మంది,

- మిగతా 2లో



రూ.2 కోట్ల లంచం

ఆరోపణలు..

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- మిగతా 2లో

ఉదయం 11 గంటలకే ఆయన నోటి

నుంచి మద్యం వాసన వచ్చేది

- భగవంత్ మాన్‌పై రాహుల్ గాంధీ తీవ్ర వ్యక్తిగత విమర్శలు
- రోజూ మద్యం సేవించే సీఎం డ్రగ్స్‌పై పోరాడలేరని వ్యాఖ్య
- పంజాబ్ పాలన కేజ్రీవాల్, అమిత్ షా చేతుల్లో ఉందని ఆరోపణ
- రాష్ట్రంలో పరిశ్రమలు పెరిగితేనే యువతకు ఉపాధి లభిస్తుందని సూచన
- ప్రధాని మోదీతో చర్చకు తాను సిద్ధమంటూ మరోసారి సవాల్

- మిగతా 2లో



అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు.. కేంద్రం కీలక నిర్ణయం



- నాలుగేళ్ల తర్వాత బయటకు వెళ్లాల్సిన 75 శాతం మందికి వెసులుబాటు
- పొడిగింపు తర్వాతా శాశ్వత సర్వీసుకు అవకాశం
- ప్రతిభ ఆధారంగా శాశ్వత నియామకాలు
- రాత పరీక్ష తర్వాతే శారీరక పరీక్ష.. నైపుణ్య ధ్రువపత్రాలు
- తొలి బ్యాచ్ సర్వీసు గడువు డిసెంబరులో ముగింపు

- మిగతా 2లో



ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో

ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డికి

ఈడీ కస్టడీ

- ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డిని రెండు రోజులు విచారించనున్న అధికారులు
- ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి ఈశ్వర్ అత్యంత సన్నిహితుడు
- ఆర్థిక లావాదేవీలు, ఇతరుల ప్రమేయంపై ఈడీ ఆరా

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డిని రెండు రోజుల పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు అతడిని కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు.ప్రస్తుతం విజయవాడ జైలులో ఉన్న ఈశ్వర్ రెడ్డిని ఈడీ అధికారులు పీటీ వారెంట్‌పై నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. అతడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరగా, న్యాయస్థానం రెండు రోజులకు అనుమతించింది. అంతకుముందు ఈశ్వర్‌కు ఈ నెల 16వ తేదీ వరకు కోర్టు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.ఏపీ లిక్కర్ స్కామ్‌లో ప్రధాన

- మిగతా 2లో

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి

కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి



- కరవు పరిస్థితులపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం
- రాష్ట్రానికి ప్రత్యేక సాయం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి
- వీబీ జీ రామ్ జీ పథకం పనిదినాలు 200కి పెంచాలని కోరిన సీఎం
- కరవు బాధితులకు డ్రాట్ కార్డులు, జేజేఎం విస్తరణకు సహకరించాలని వినతి
- పంటల బీమా పరిహారం త్వరగా చెల్లించేలా చూడాలని సూచన

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగం కుదేలైన నేపథ్యంలో, రైతులను, ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో కరవు తీవ్రతను అంచనా వేసేందుకు పర్యటించిన కేంద్ర అంతర మంత్రిత్వ శాఖల బృందం (ఐఎంసీటీ) బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న ఉపశమన చర్యలను సీఎం వారికి సమగ్రంగా వివరించారు.రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను కేంద్ర బృందానికి వివరిస్తూ, “ఒకవైపు తీరప్రాంతం తుఫాన్లతో నష్టపోతుంటే, మరోవైపు రాయలసీమ, ఇతర ప్రాంతాలు ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవు కోరల్లో చిక్కుకున్నాయి” అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది సాధారణం కంటే అత్యంత తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు.

ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని, సాగునీటితో పాటు తాగునీరు, పశుగ్రాసానికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన ప్రాంతంగా అనంతపురం జిల్లా నిలిచిన విషయాన్ని ఆయన బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 412 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, పంట నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలతో వారం రోజుల్లో కేంద్రానికి నివేదిక

- మిగతా 2లో



విద్యార్థుల సంక్షేమం కోసమే

రాజకీయాల్లోకి వచ్చా

పెన్ పవర్ డెస్క్:వచ్చినట్లు తమిళనాడు ముఖ్యమంత్రి సి.విజయ్ జోసఫ్ తెలిపారు. అవినీతి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పది, ఇంటర్ బోర్డ్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించేందుకు ఏర్పాటు చేసిన విద్యా పురస్కారాల మొదటి విడత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని,

- మిగతా 2లో



మీరూ నిరసన తెలపొచ్చుగా..


పిటిషనర్‌తో సీజేఐ వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:: షెడ్యూల్డ్ కులాలు , షెడ్యూల్డ్ తెగల రిజర్వ్‌డ్ స్థానాలపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “మీరు రాంగ్ డయల్ చేస్తున్నారు. ఇది నిరసనలు, ప్రదర్శనల యుగం. బహుశా మీరు కూడా అదే బాటలో నడవాలి” అని సరదాగా వ్యాఖ్యానించారు. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల రిజర్వ్‌డ్ సీట్ల

- మిగతా 2లో

‘మురసు’ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో

సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే



- తుపాను ప్రభావిత గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో సీఎం ఏరియల్ సర్వే - మిగతా 2లో
- కరవు పరిస్థితులపై కేంద్ర బృందంతో చంద్రబాబు సమీక్ష
- రాష్ట్రంలో 388 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించిన ప్రభుత్వం
- ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచాలని కేంద్రానికి వినతి
- ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలని విజ్ఞప్తి

మేయర్‌గా అవకాశం కల్పించిన చంద్రబాబు,

పవన్ కల్యాణ్ లకు ధన్యవాదాలు



- విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధా ఘనవిజయం
- ఇది విజయవాడ ప్రజల గెలుపని వ్యాఖ్య
- తన గెలుపు కోసం కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు కృషి చేశారన్న రాధా

- మిగతా 2లో



అమెరికాలో డెమోక్రాట్ల ప్రభంజనం.. ట్రంప్‌కు భారీ షాక్!

లిలివాషింగ్టన్:లిలి అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నవంబర్ 3న జరిగిన ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. అమెరికా పార్లమెంట్‌లోని ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్), సెనెట్ రెండింటిలోనూ మెజారిటీ సాధించి రాజకీయ ఆధిపత్యాన్ని సొంతం చేసుకుంది. దీంతో రెండేళ్లుగా కొనసాగుతున్న రిపబ్లికన్ల ఏకపక్ష రాజకీయ ఆధిపత్యానికి బ్రేక్ పడింది.

రెండు సభల్లోనూ డెమోక్రాట్ల ఆధిక్యం

435 స్థానాలున్న ప్రతినిధుల సభలో డెమొక్రాట్లు మెజారిటీకి అవసరమైన 218 స్థానాల మార్కును దాటారు. మరోవైపు 100 మంది సభ్యులున్న సెనెట్‌లోనూ డెమొక్రాట్లకు కనీసం 54 స్థానాల మద్దతు లభించింది. ఇందులో వారితో కలిసి వ్యవహరించే ఇద్దరు స్వతంత్ర సభ్యుల మద్దతు కూడా ఉంది. కొన్ని స్థానాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతోంది.

రిపబ్లికన్ల కంచుకోటల్లో డెమోక్రాట్ల జెండా

ఈ ఎన్నికల్లో సంప్రదాయంగా రిపబ్లికన్లకు మద్దతుగా నిలిచే రాష్ట్రాల్లోనూ డెమొక్రాట్లు విజయాలు సాధించారు. కాన్సాస్‌లో దాదాపు 94 ఏళ్ల తర్వాత డెమొక్రటిక్ పార్టీకి సెనెట్ స్థానం దక్కింది. టెక్సాస్‌లోనూ సెనెట్ స్థానాన్ని గెలుచుకోవడంతో పాటు గవర్నర్ పదవిని కూడా డెమొక్రాట్లు కైవసం చేసుకున్నారు. జార్జియా, అయోవా, ఒహాయో రాష్ట్రాల్లోనూ గవర్నర్ ఎన్నికల్లో విజయాలు నమోదు చేశారు.

ట్రంప్ విధానాలపై ప్రజాగ్రహం?

ధరల పెరుగుదల, జీవన వ్యయం, ఇరాన్‌తో యుద్ధం వంటి అంశాలు ఎన్నికల్లో కీలక ప్రభావం చూపినట్లు రాజకీయ విశ్లేషణలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా నిత్యావసరాల ధరలు, ఇంధన ఖర్చులు పెరగడం ఓటర్లలో అసంతృప్తిని పెంచినట్లు తెలుస్తోంది. ట్రంప్ తీసుకున్న కొన్ని నిర్ణయాలపై ప్రజల్లో వ్యతిరేకత ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ట్రంప్ పాలనకు కొత్త సవాళ్లు

డెమొక్రాట్లు రెండు సభల్లోనూ మెజారిటీ సాధించడంతో ట్రంప్ ప్రభుత్వానికి ఇకపై చట్టాల ఆమోదం, బడ్జెట్, కీలక నియామకాల విషయంలో సవాళ్లు ఎదురుకానున్నాయి. డెమొక్రాట్లు ప్రభుత్వ విధానాలపై విచారణలు చేపట్టే అవకాశం కూడా ఉంది. ప్రతినిధుల సభలో హకీమ్ జెఫ్రీస్ స్పీకర్ బాధ్యతలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా ఈ ఎన్నికల ఫలితాలు అమెరికా రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికాయి.

ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో వ్యక్తిగత విమర్శలు చేశారు. ఆయనకు మద్యపానం సేవించే అలవాటు ఉందని, అలాంటి వ్యక్తి రాష్ట్రంలో మాదకద్రవ్యాల సమస్యను ఎలా పరిష్కరించగలరని ప్రశ్నించారు. సంగ్రూర్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో పాల్గొన్న రాహుల్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో తాను, భగవంత్ మాన్ లోక్‌సభ సభ్యులుగా ఉన్నప్పటి సంఘటనను రాహుల్ గుర్తు చేసుకున్నారు. "ఉదయం 11 గంటలకే ఆయన నోటి నుంచి మద్యం వాసన వచ్చేది" అని సంచలన ఆరోపణ చేశారు. మద్యం సేవించడం ఆయన వ్యక్తిగత విషయం కావొచ్చుని, కానీ ప్రతిరోజూ మత్తులో ఉండే ముఖ్యమంత్రి మాదకద్రవ్యాల వల్ల కలిగే బాధను ఎలా అర్థం చేసుకోగలరని నిలదీశారు. పంజాబ్‌కు డ్రగ్స్ సమస్యపై నిజంగా బాధపడే నాయకుడు అవసరమని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం పంజాబ్‌ను పాలించడం లేదని, రాష్ట్రాన్ని ఢిల్లీ నుంచి నడిపిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. "పంజాబ్ పాలనను సగం అరవింద్ కేజ్రీవాల్, మరో సగం కేంద్ర హోంమంత్రి అమిత్ షా నడుపుతున్నారు. భగవంత్ మాన్ కేవలం అక్కడ కూర్చుంటున్నారు అంతే" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పంజాబ్ నుంచే పాలన అందిస్తామని స్పష్టం చేశారు. మూడేళ్లలో డ్రగ్స్‌ను అంతం చేస్తానన్న అమిత్ షా వ్యాఖ్యలను కొట్టిపారేసిన రాహుల్, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అంతకాలం కొనసాగకపోవచ్చని అన్నారు. గతంలో పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య పెరిగిపోతోందని తాను హెచ్చరించినప్పుడు బీజేపీ, అకాలీదళ్ తన మాటలను పట్టించుకోలేదని రాహుల్ గుర్తుచేశారు. రాష్ట్రంలో డ్రగ్స్, గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని నిర్మూలించాలంటే పరిశ్రమలు, ఫ్యాక్టరీలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్ గాంధీ మరోసారి సవాల్ విసిరారు. మోదీతో ముఖాముఖి చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, కేవలం ఐదు నిమిషాల్లోనే మోదీ ఒక "దేశద్రోహి" అని, ఆయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేతిలో కీలుబొమ్మ అని నిరూపించగలనని అన్నారు.

రూ.2 కోట్ల లంచం ఆరోపణలు.. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో కేరళం ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు అనుమతించింది. 2006లో కేరళం ప్రజాపనుల శాఖ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ కాంట్రాక్టు బిల్లులు క్లియర్ చేసేందుకు రూ.2 కోట్లు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకుంది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ) కింద విచారణకు అనుమతించినట్లు రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితల బుధవారం వెల్లడించారు. ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడుతుందని చెప్పారు. మలేసియాకు చెందిన ఇంజినీర్ లీ సీ బిన్ నుంచి జ్ఞానేశ్‌కుమార్ రూ.2 కోట్లు డిమాండ్ చేశారంటూ కాంట్రాక్టర్ వీ.ఓ. సాజన్ గతంలో ఆరోపించారు. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు (కేఎస్‌టీపీ) పనులు చేపట్టిన పాథిబెల్ సంస్థకు లీ సీ బిన్ అనుబంధంగా పనిచేశారు. ఆ సంస్థకు సాజన్ సబ్ కాంట్రాక్టర్‌గా మెటీరియల్ సరఫరా చేసేవారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను జ్ఞానేశ్‌కుమార్ నిలిపివేసి, వాటిని విడుదల చేయడానికి రూ.2 కోట్లు అడిగారని సాజన్ మీడియాకు వెల్లడించారు. బిల్లులు చెల్లించకపోవడంతో లీ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, ఈ విషయాన్ని తనతో చెప్పుకొన్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం లీ ఆత్మహత్య చేసుకుని మరణించారు. జ్ఞానేశ్‌కుమార్ ప్రస్తుతం సీఈసీగా ఉన్నప్పటికీ, గతంలో పీడబ్ల్యూడీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై విచారణకు ఎలాంటి అడ్డంకి లేదని చెన్నితల స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పులు కూడా విచారణకు ఆటంకం లేదని చెబుతున్నాయని అన్నారు. సీఈసీ పదవికి సంబంధించిన రక్షణ, గతంలో నిర్వహించిన ఇతర పదవుల్లో తీసుకున్న చర్యలకు వర్తించదని వివరించారు.

గతంలో జరిగిన విజిలెన్స్ విచారణ జ్ఞానేశ్‌కుమార్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేందుకే ఉద్దేశించినట్లు సాజన్ ఆరోపించారు. తాజా అనుమతితో ఈ వ్యవహారంపై మరోసారి విచారణకు మార్గం సుగమమైంది.

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి

- మొదటి పేజి తరువాయి

సమర్పిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయానికి అండగా కీలక పథకాల విస్తరణకరవు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధిని, వ్యవసాయాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కొన్ని కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి క్షేత్రస్థాయిలో మానవ వనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో 'వీబీ జీ రామ్ జీ' పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని కోరారు. ఈ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానించడం ద్వారా రైతులకు కూలీల కొరత తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సూచించారు. కరవు కారణంగా రైతుల ఆదాయం పూర్తిగా పడిపోయిందని, గతంలో తీవ్ర కరవు వచ్చినప్పుడు రాయలసీమలో పది ఎకరాల రైతులకు కూడా రేషన్ కార్డులు ఇచ్చి ఆదుకున్నామని గుర్తుచేశారు. అదే తరహాలో ప్రస్తుతం అర్హులైన కరవు బాధిత కుటుంబాలకు 'డ్రాట్ కార్డులు' జారీ చేసే అంశాన్ని పరిశీలించి, కేంద్ర సహకారంతో నిత్యావసరాలను సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు, రైతుల వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు కేంద్రం తోడ్పాటునందించాలని కోరారు.

జల్ జీవన్ మిషన్‌తో శాశ్వత పరిష్కారం

వర్షాభావంతో భూగర్భ జలమట్టాలు ప్రమాదకరంగా పడిపోయాయని, కొత్తగా ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడటం లేదని ముఖ్యమంత్రి తెలిపారు. కేవలం తాత్కాలిక నీటి సరఫరా చర్యలతో సరిపెట్టకుండా, శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇందుకోసం 'జల్ జీవన్ మిషన్' (జేజేఎం) పథకాన్ని మరింత విస్తరించి, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానం వంటి పనులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారాన్ని త్వరగా అందించడం అత్యవసరమని అన్నారు. బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా, వీలైనంత త్వరగా పరిహారం రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది రైతులకు తదుపరి పంటకు పెట్టుబడిగా ఉపయోగపడుతుందని వివరించారు.

ఈనెల 2, 3 తేదీల్లో కేంద్ర బృందం రెండు టీమ్‌లుగా విడిపోయి కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక, తమ క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా 15 రోజుల్లో కేంద్రానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని ఐఎంసీటీ సభ్యులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందించే సహాయంపై నిర్ణయం తీసుకోనుంది.

'మురసు' తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం రాష్ట్రంలోని రెండు ప్రధాన సమస్యలపై దృష్టి సారించారు. ఒకవైపు 'మురసు' తుపానుతో దెబ్బతిన్న జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించగా, మరోవైపు తీవ్ర కరవు పరిస్థితులపై కేంద్ర బృందంతో సమీక్షా సమావేశం జరిపారు. రాష్ట్రంలో విభిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. తుపాను కారణంగా ప్రభావితమైన గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో సీఎం ఏరియల్ సర్వే నిర్వహించారు. కారంచేడు, కొత్తపట్నం, చీరాల, చిలకలూరిపేట, పర్చూరు వంటి ప్రాంతాల్లోని ముంపు నీటిని వెంటనే తొలగించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారులకు అంతరాయం కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. మరోవైపు, ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్నాయని, కొన్నిచోట్ల చిన్న నీటిపారుదల చెరువులు పొంగిపొర్లుతున్నాయని అధికారులు సీఎంకు వివరించారు.

అనంతరం, రాష్ట్రంలో కరవు పరిస్థితులను అంచనా వేయడానికి వచ్చిన అంతర్-మంత్రిత్వ కేంద్ర బృందం (×వీజు) సభ్యులతో చంద్రబాబు సమావేశమయ్యారు. నవంబర్ 2, 3 తేదీల్లో కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించిన ఈ బృందం, తమ పరిశీలన వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేసింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో విచిత్ర పరిస్థితి నెలకొందని, కోస్తాంధ్ర తుపానులతో సతమతమవుతుంటే, రాయలసీమ, ఇతర ప్రాంతాలు ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవుతో అల్లాడుతున్నాయని వివరించారు. ఈ ఏడాది వర్షపాతం గణనీయంగా తగ్గిపోవడంతో ఖరీఫ్ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ముఖ్యంగా దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన

అనంతపురం జిల్లా పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. సాగునీరు, తాగునీరు, పశుగ్రాసం కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే 21 జిల్లాల్లోని 388 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, నష్టాల అంచనాతో కేంద్రానికి నివేదిక సమర్పించామని, వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను పంపుతామని చెప్పారు. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సీఎం నొక్కిచెప్పారు. ఇందుకోసం ఉపాధి హామీ పథకం (ఎదీ-+ =ూవీ +) కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని, ఈ పథకాన్ని వ్యవసాయ పనులకు కూడా వినియోగించేలా అనుమతించాలని కోరారు. ఈ చర్య వల్ల వ్యవసాయ కూలీల కొరత తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో అదనపు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- మొదటి పేజి తరువాయి

కౌంటింగ్‌లో 52 వేల మంది సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పరిస్థితులను బట్టి పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీకి అనుమతిస్తామని, ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2.61 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఎన్నికల బందోబస్తుపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఒకే దశలో పోలింగ్ జరుగుతున్నందున రద్దీని నియంత్రించేందుకు తగినంత బలగాలను మోహరించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 582 జెడ్పీటీసీ స్థానాలు, 7,767 ఎంపీటీసీ స్థానాలకు గాను ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే 77 జెడ్పీటీసీ స్థానాలు, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం కావడంతో, మిగిలిన స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల బరిలో 2,169 మంది జెడ్పీటీసీ అభ్యర్థులు, 18,843 మంది ఎంపీటీసీ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

ఈ ఎన్నికల్లో మొత్తం 2.61 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.28 కోట్ల మంది పురుషులు, 1.32 కోట్ల మంది మహిళలు, 1,282 మంది ఇతరులు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం గమనార్హం. ఓటర్ల సౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా 31,460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. మొత్తం పోలింగ్ కేంద్రాల్లో 8,904 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా, 7,160 కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఈ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. 16,064 కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, సుమారు 6,000 కేంద్రాల్లో ల్యాప్‌టాప్‌ల ద్వారా వెబ్‌కాస్టింగ్, 6,507 కేంద్రాల్లో వీడియోగ్రఫీ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా 36,684 మంది ప్రిసైడింగ్ అధికారులను నియమించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సుమారు 40,679 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. సిబ్బందిని, ఎన్నికల సామగ్రిని తరలించేందుకు 4,442 భారీ వాహనాలు, 3,200 తేలికపాటి వాహనాలను వినియోగిస్తున్నారు. పోలింగ్ కోసం 1,01,618 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. ఓట్ల లెక్కింపు కోసం 365 కేంద్రాలను ఏర్పాటు చేయగా, వాటిలో 9,062 కౌంటింగ్ టేబుళ్లను సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాలపై పట్టు నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

మేయర్‌గా అవకాశం కల్పించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ లకు ధన్యవాదాలు

విజయవాడ నగర మేయర్‌గా జనసేన నేత, కూటమి అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ ఘన విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థి, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మిపై రాధా భారీ ఆధిక్యంతో గెలుపొందారు. ఈ సందర్భంగా వంగవీటి రాధా మాట్లాడుతూ... తనకు మేయర్ గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం తన ఒక్కడి విజయం కాదని, విజయవాడ ప్రజలందరి విజయమని చెప్పారు. విజయవాడ ప్రజలు చూపిన అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. తన విజయం కోసం ఎంపీ కేశినేని చిన్నితో పాటు స్థానిక కూటమి ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు కృషి చేశారని తెలిపారు. అందరినీ కలుపుకుని నగర అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు.. కేంద్రం కీలక నిర్ణయం

అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో చేరిన అగ్నివీరులకు కేంద్ర ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే ఉన్న నాలుగేళ్ల సర్వీసుకు అదనంగా మరో రెండేళ్లు పొడిగించాలని నిర్ణయించింది. తొలి బ్యాచ్ అగ్నివీరుల పదవీకాలం ముగియనున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిర్ణయం ప్రకారం, నాలుగేళ్ల సేవ తర్వాత సాధారణ విధానంలో శాశ్వత సైనికులుగా ఎంపిక కాని మిగిలిన 75 శాతం అగ్నివీరులకు మరో రెండేళ్లు పనిచేసే అవకాశం లభించనుంది. ఈ పొడిగించిన సేవ పూర్తయ్యాక కూడా ప్రతిభ ఆధారంగా సాధారణ సైనిక విభాగంలో చేరేందుకు అవకాశం కల్పిస్తామని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి వెల్లడించారు.

అగ్నిపథ్ పథకం 2022లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ పథకం కింద సైన్యం, నౌకాదళం, వాయుసేనల్లో నాలుగేళ్ల కాలానికి నియామకాలు చేపడుతున్నారు. ఈ గడువు ముగిసిన తర్వాత ప్రతి బ్యాచ్‌లో గరిష్ఠంగా 25 శాతం మందిని ప్రతిభ, సైనిక దళాల అవసరాల ఆధారంగా సాధారణ సర్వీసులో కొనసాగించే

అవకాశం ఉంది. మిగిలినవారు విధుల నుంచి వైదొలగాల్సి వచ్చేది. తాజా నిర్ణయంతో వారికి అదనపు సేవా అవకాశం లభించనుంది. నియామక ప్రక్రియలోనూ మార్పులు ప్రకటించారు. ఇకపై శారీరక పరీక్షకు ముందుగా రాత పరీక్ష నిర్వహించనున్నారు. సైన్యంలో పనిచేసిన సమయంలో అగ్నివీరులు పొందిన శిక్షణ, నైపుణ్యాలను గుర్తిస్తూ ధ్రువపత్రాలు కూడా అందించనున్నారు. తొలి బ్యాచ్‌లో సుమారు 18 వేల మంది అగ్నివీరుల నాలుగేళ్ల సర్వీసు గడువు 2026 డిసెంబరులో ముగియనుండటంతో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డికి ఈడీ కస్టడీ

- మొదటి పేజి తరువాయి

నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కెసిరెడ్డికి ఈశ్వర్ అత్యంత సన్నిహితుడని ఈడీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ కుంభకోణంలో ఈశ్వర్ పాత్ర, జరిగిన ఆర్థిక లావాదేవీలు, తెరవెనుక ఉన్న ఇతర కీలక వ్యక్తుల ప్రమేయంపై ఈడీ అధికారులు లోతుగా ఆరా తీయనున్నారు. ఈ రెండు రోజుల విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

మీరూ నిరసన తెలపొచ్చుగా.. పిటిషనర్‌తో సీజేఐ వ్యాఖ్య

- మొదటి పేజి తరువాయి

విషయంలో జోక్యం చేసుకోబోమని స్పష్టంచేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తానాపూర్ జిల్లా కదిపుర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని 1952 నుంచి ఎస్సీలకు రిజర్వ్ చేయడాన్ని సవాలు చేస్తూ జగదీశ్ సింగ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనివల్ల నాలుగైదు కుటుంబాలు మాత్రమే లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లను రొటేషన్ పద్ధతిలో కేటాయించాలని కోరారు. ఇప్పటికే పంచాయతీలు, మున్సిపల్ ఎన్నికల్లో ఈ విధానాన్ని అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల అభ్యర్థుల ఎంపికలో ఓటర్లకు ఛాయిస్ లేకుండా పోతోందని తన పిటిషన్‌లో వాదించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి మోహన నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఒక స్థానాన్ని ఒక సామాజిక వర్గానికి రిజర్వ్ చేయడమంటే వ్యక్తుల ఓటు హక్కును హరించడం కాదని జస్టిస్ బాగ్చీ పేర్కొన్నారు. మీ సామాజిక వర్గానికి ఓటు వేయలేకపోతున్నామని చెప్పడం అర్థం లేని వాదన అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీని, ఐడియాలజీని బట్టి ఓటేస్తున్నారే తప్ప కులం, మతం ఆధారంగా కాదని వ్యాఖ్యానించారు. అయినా, జనరల్ స్థానాల్లో ఒక వ్యక్తి ఎక్కడి నుంచైనా పోటీ చేసే స్వేచ్ఛను రాజ్యాంగం కల్పిస్తోందని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే నిరసన రూపంలో మీ ఆందోళన తెలియజేయొచ్చంటూ సీజేఐ పిటిషనర్‌కు సూచించారు. చట్టసభ్యులతో దీనిపై చర్చించాలని, ఈ విషయంలో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోబోదని ధర్మాసనం స్పష్టచేసింది.

విద్యార్థుల సంక్షేమం కోసమే రాజకీయాల్లోకి వచ్చా

- మొదటి పేజి తరువాయి

జీవితంలో ఎదురయ్యే అడ్డంకులకు భయపడకూడదని పిలుపునిచ్చారు. "మీరు వెళ్తున్న మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే, అప్పటికే మీ విజయం ఖాయమయ్యిందని అర్థం చేసుకోవాలి. మీ సంక్షేమం కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చా. అది మీకూ తెలుసు" అని సీఎం విజయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

వంగవీటి రాధా గెలుపు చరిత్రాత్మకం

- విజయవాడ మేయర్‌గా కూటమి అభ్యర్థి వంగవీటి రాధా ఘన విజయం
- రాధాకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ కేశినేని చిన్ని
- ఓటింగ్ శాతం తగ్గినా అపూర్వ విజయం దక్కిందన్న చిన్ని



విజయవాడ నూతన మేయర్‌గా కూటమి అభ్యర్థి వంగవీటి రాధా ఘన విజయం సాధించారు. జనసేన తరపున పోటీ చేసిన ఆయన భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని స్పందిస్తూ... రాధాకు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ ప్రజలు వంగవీటి రాధాకు పట్టం కట్టారని, ఈ గెలుపు చరిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైనప్పటికీ, ప్రజలు కూటమికి అపూర్వమైన విజయాన్ని అందించారని చిన్ని కొనియాడారు. "ఓటింగ్ శాతం కాస్త పెరిగి ఉంటే మెజార్టీ రెండు లక్షలు దాటి ఉండేది. ఈ విజయం మాపై మరింత బాధ్యతను పెంచింది" అని ఆయన వ్యాఖ్యానించారు. విజయవాడ అభివృద్ధి కోసం, మేయర్‌గా ఎన్నికైన రాధాతో కలిసి అందరూ సమష్టిగా కృషి చేస్తామని కేశినేని చిన్ని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు ఎంతో విశ్వాసాన్ని ప్రదర్శించారని, ఈ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడు వరదయ్య మృతికి ఎమ్మెల్యే బొజ్జల నివాళి

- మృతుడి పిల్లల చదువు బాధ్యత తీసుకుంటానని హామీ

తొట్టంబేడు,పెన్ పవర్,నవంబర్ 04:

తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వయ్యవూరు వరదయ్య ఆకస్మిక మృతితో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి రిషిత రెడ్డి వరదయ్య భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ వరదయ్య మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన పిల్లల చదువు బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు.





గ్రామాల అభివృద్ధికి ఎన్డీఏ కూటమిని గెలిపించాలి



- గ్రామ స్వరాజ్యం టీడీపీతోనే సాధ్యం: గొల్ల నరసింహ యాదవ్

తిరుపతి, పెన్ పవర్, నవంబర్ 04:

గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎన్డీఏ కూటమి అభ్యర్థులను జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 48 శాతం సీట్లు కేటాయించిన ఘనత టీడీపీ, చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు.

తిరుపతి మేయర్ అభ్యర్థి జేబీ శ్రీనివాసులు, కార్పొరేటర్లను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమం కోసం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని గొల్ల నరసింహ యాదవ్ కోరారు.

పెన్‌పవర్ కథనానికి స్పందించిన ఆర్డీవో

- టపాకాయల దుకాణాల తరలింపునకు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన

- ఆసుపత్రి, కళాశాల, అన్న క్యాంటీన్, సబ్‌స్టేషన్, బీసీ హాస్టల్ సమీపంలో దుకాణాల ఏర్పాటుపై భద్రతా ఆందోళనలు

శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 04:

శ్రీకాళహస్తిలో టపాకాయల దుకాణాల ఏర్పాటుపై పెన్‌పవర్ లో ప్రచురితమైన కథనానికి ఆర్డీవో భాను ప్రకాశ్ రెడ్డి స్పందించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని టపాకాయల దుకాణాల ఏర్పాటుకు ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. ప్రస్తుతం దుకాణాలు ఏర్పాటు చేస్తున్న ప్రాంతానికి సమీపంలో ఏరియా ఆసుపత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, అన్న క్యాంటీన్, విద్యుత్ సబ్‌స్టేషన్, బీసీ హాస్టల్ ఉండటంతో ప్రమాదాల ముప్పుపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దుకాణాల ఏర్పాటుకు సంబంధించి అనుమతులపై ఆర్డీవో ఆరా తీసినట్లు తెలిసింది.

గతంలో ప్రతి ఏడాది అయ్యల నాయుడు చెరువు వద్ద టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసేవారని, ఈసారి ప్రజా ప్రయోజనాలు, భద్రతా అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, పానగల్ మార్కెట్ ప్రాంతాలను దుకాణదారులకు ప్రత్యామ్నాయాలుగా సూచించినట్లు వెల్లడించారు.



ప్రజల భద్రతే ప్రాధాన్యం..

టపాకాయల విక్రయాల సమయంలో అధిక జనసంచారం ఉండే అవకాశం నేపథ్యంలో అగ్నిప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఆసుపత్రి, విద్యాసంస్థలు, విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో టపాకాయల దుకాణాల ఏర్పాటుపై అధికారులు సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.టపాకాయల దుకాణాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని ఆర్డీవో భాను ప్రకాశ్ రెడ్డి తెలిపినట్లు సమాచారం. అయితే, ప్రస్తుతం ఏర్పాటు చేసిన దుకాణాలను ప్రత్యామ్నాయ ప్రాంతాలకు తరలిస్తారా? ఏ ప్రాంతాన్ని ఖరారు చేస్తారు? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

అంజూరులో జనసేన ప్రచార జోరు



- ఎంపీటీసీ అభ్యర్థి పొన్నపాల మోహన్ విజయానికి సాయి కొట్టే ప్రసాద్ విస్తృత ప్రచారం

శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, నవంబర్ 04:

అంజూరు గ్రామ అభివృద్ధే లక్ష్యంగా జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి పొన్నపాల మోహన్ విజయానికి శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్, జనసేన నాయకుడు సాయి కొట్టే ప్రసాద్ విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామ ప్రజలు, ఓటర్లను నేరుగా కలుసుకుని గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి పొన్నపాల మోహన్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనకు జనసేన కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తితో జనసేన అభ్యర్థికి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు.

విజయవాడలో వంగవీటి రాధాకృష్ణ ఘన విజయం..
హృదయపూర్వక అభినందనలు

- ప్రజా ఆదరణకు నిదర్శనం.. ప్రజాసేవలో మరో చారిత్రాత్మక మైలురాయి: సాయి కొట్టే ప్రసాద్

శ్రీకాళహస్తి, పెన్ పవర్, నవంబర్ 04:

విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో జనసేన పార్టీ నాయకులు, ఎన్డీఏ కూటమి ఉమ్మడి మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ ఘన విజయం సాధించడం పట్ల శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ తరఫున శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్, ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి సాయి కొట్టే ప్రసాద్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

వైసీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మిపై 1,30,872 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించడం ప్రజల ఆదరణకు, ప్రజాస్వామ్య తీర్పుకు నిదర్శనమని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ఐక్యత, అభివృద్ధి, ప్రజాసేవ లక్ష్యంగా సాగుతున్న ప్రస్థానంలో ఈ విజయం ప్రత్యేక ఘట్టమని కొనియాడారు.

వంగవీటి రాధాకృష్ణ భవిష్యత్తులో మరిన్ని ప్రజాసేవా కార్యక్రమాలతో విజయవాడ నగర అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సాయి కొట్టే ప్రసాద్ ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ, తిరుపతి పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయ కమిటీ తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

- గడివేముల పంపిణీ కేంద్రంలో ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 4

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా గడివేముల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని (డిస్ట్రిబ్యూషన్ సెంటర్) జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తరలింపు ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన సామగ్రిని సిబ్బందికి సక్రమంగా పంపిణీ చేస్తున్న తీరును సమీక్షించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఎన్నికల సామగ్రి పూర్తిస్థాయిలో అందేలా చూడాలని, పంపిణీ ప్రక్రియలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా సమన్వయంతో వ్యవహరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని సకాలంలో, సురక్షితంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రశాంతమైన, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



గిరిజనులకు న్యాయ హక్కులపై అవగాహన

- లోబావి గిరిజన కాలనీలో న్యాయ అవగాహన ర్యాలీ, విజ్ఞాన సదస్సు

శ్రీకాళహస్తి,పెన్ పవర్, నవంబర్ 04:

జాతీయన్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజన ప్రజలకు న్యాయ హక్కులపై అవగాహన కల్పించే లక్ష్యంతో శ్రీకాళహస్తిలోని లోబావి గిరిజన కాలనీలో న్యాయ అవగాహన ర్యాలీ, విజ్ఞాన సదస్సును నిర్వహించారు.

న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికిపాటి రమేష్, శ్రీరామ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో వివిధ చట్టాలు, ప్రాథమిక న్యాయ హక్కులు, ఉచిత న్యాయ సహాయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా న్యాయవాది రాజేశ్వరరావు మాట్లాడుతూ,

ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని, న్యాయ పరిజ్ఞానం సమాజంలో నేరాల నియంత్రణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. నిరుపేదలు న్యాయస్థానాల ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పారా లీగల్ వాలంటీర్లకు తెలియజేస్తే, సంబంధిత న్యాయ సేవా సంస్థల ద్వారా పరిష్కారానికిచర్యలుతీసుకుంటామని వివరించారు. కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు వంటి సమస్యలతో బాధపడేవారు న్యాయ సేవా అధికార సంస్థలను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందాలని సూచించారు. క్షణికావేశంలో కేసులు నమోదు చేసుకుని సమయం, ధనం వృథా చేసుకోవద్దని, పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో న్యాయ అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చట్టాలపై చైతన్యం పెంపొందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు, స్థానిక ప్రజలు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తిరుపతి మేయర్ పోరులో నైతిక విజయం మాదే



- అధికార, ధనబలాన్ని ఎదురించి ప్రజల మద్దతు పొందాం: నీరుగట్టు నగేష్

తిరుపతి, పెన్ పవర్, నవంబర్ 04:

తిరుపతి మేయర్ ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని ఆమ్ ఆద్మీ పార్టీ మేయర్ అభ్యర్థి నీరుగట్టు నగేష్ పేర్కొన్నారు. దాడులు, బెదిరింపులు, ప్రలోభాలు, ధనబలం, అధికార దుర్వినియోగం వంటి కుట్రలు జరిగినప్పటికీ ప్రజల గుండెల్లో తమకే స్థానం ఉందన్నారు.

చివరి క్షణం వరకు తనకు అండగా నిలిచిన పార్టీ కార్యకర్తలు, మిత్రులు, కార్పొరేటర్ అభ్యర్థులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు.

పదవులు, గెలుపోటములతో సంబంధం లేకుండా తిరుపతి ప్రజల మధ్యే ఉంటూ, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా జీవితాంతం ప్రజాసేవ కొనసాగిస్తానని నీరుగట్టు నగేష్ స్పష్టం చేశారు. ప్రజల ఆదరణే తన బలమని, వారి నమ్మకాన్ని బాధ్యతగా భావిస్తానని తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ

- ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి.....

- జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీస్

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ నవంబర్ 04

రేపు జరగనున్న జడ్పీటీసీ /ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో నంద్యాల జిల్లాలోని గోస్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గల గోస్పాడు, జిల్లెల్ల, చింతకుంట్ల తదితర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీస్ స్వయంగా క్షేత్రస్థాయిలో సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు అధికారులు సిబ్బందికి సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో క్రమశిక్షణతో, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఎన్నికల అధికారులతో సమన్వయంగా పనిచేయాలని, పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌కు సురక్షితంగా చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వయోవృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు అవసరమైన సహకారం అందిస్తూ ప్రతి ఓటరు ఎలాంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పించాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లోకి నిషేధిత వస్తువులు తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని స్పష్టం చేశారు.

ప్రజలు, రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిబంధనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎం.సీ.సీ) తప్పనిసరిగా పాటించాలని, పోలీస్ యాక్ట్-30, బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్-163 నిబంధనలను ఉల్లంఘించరాదని, గుంపులుగా గుమిగూడడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, సోషల్ మీడియాలో తప్పుడు లేదా విద్వేషపూరిత ప్రచారాలు చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు లేదా 112 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ సూచించారు.



మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభంజనం

- జనసేనటీడీపీబీజేపీ ఐక్యతకు ప్రజల ఘన ఆమోదం: దండి నరేంద్ర

- అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు ప్రజల మద్దతు

శ్రీకాళహస్తి, పెన్ పవర్,నవంబర్ 04:

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సాధించిన ఘన విజయంపై జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త దండి నరేంద్ర హర్షం వ్యక్తం చేశారు. జనసేనటీడీపీబీజేపీ కూటమిపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రజలు అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు పట్టం కట్టారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకత్వం సమన్వయంతో సాగుతున్న ఎన్డీఏ కూటమి రాష్ట్ర అభివృద్ధికి మరింత వేగాన్ని అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలపడం కూటమి లక్ష్యమని పేర్కొన్నారు.

ఘన విజయం అందించిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, విజయం సాధించిన అభ్యర్థులందరికీ అభినందనలు తెలియజేశారు.



ఎన్‌సీసీతో యువతలో దేశభక్తి, క్రమశిక్షణ

- బాధ్యతగల పౌరులుగా, ఉత్తమ నాయకులుగా ఎదగాలి: డాక్టర్ డి. భాస్కర్

శ్రీకాళహస్తి,పెన్ పవర్, నవంబర్ 04:

ఎన్‌సీసీ అనేది దేశభక్తి, ఐక్యత, క్రమశిక్షణకు ప్రతీక అని, ఎన్‌సీసీ శిక్షణతో యువత ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎన్‌సీసీ అధికారి డాక్టర్ డి. భాస్కర్ అన్నారు.

బుధవారం శ్రీకాళహస్తిలోని ఎస్.వి.ఏ. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణతో పాటు డిగ్రీ ప్రథమ సంవత్సరం నూతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. క్రమశిక్షణతో మెలిగి కళాశాలకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని క్యాడెట్లకు సూచించారు.



అనంతరం నూతన విద్యార్థులకు ఫిజికల్ టెస్టులు నిర్వహించి, అర్హులైన వారిని ఎన్‌సీసీలోకి ఎంపిక చేశారు. ఎన్‌సీసీ శిక్షణతో ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడతాయని వక్తలు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి 29వ బెటాలియన్ ఎన్‌సీసీ అధికారులు మురళి, మధు, కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం!

- బుచ్చి మండలంలో 34,670 మంది ఓటర్లు.. 154 మంది సిబ్బందితో పోలింగ్ నిర్వహణ

- 13 అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తింపు.. వెబ్‌కాస్టింగ్‌తో ప్రత్యేక నిఘా

బుచ్చిరెడ్డిపాళెం పెన్ పవర్ నవంబర్ 4.

బుచ్చిరెడ్డిపాళెం మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండల పరిధిలో మొత్తం 34,670 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 16,691 మంది పురుషులు కాగా, 17,979 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 1,288 మంది అధికంగా ఉండటం విశేషం.మండలంలో మొత్తం 9 ఎంపీటీసీ సెగ్మెంట్లు ఉండగా, 22 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. మొత్తం 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఏకగ్రీవమైన ఎంపీటీసీ స్థానాల కారణంగా 31 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు అధికారుల సమాచార పత్రంలో పేర్కొన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం 154 మంది సిబ్బందిని నియమించారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా

ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ





సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మండల పరిధిలో 7 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా, 13 కేంద్రాలను అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. సమస్యాత్మక కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించడంతో పాటు, అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. ముఖ్యంగా ఇస్కపాలెం, పెనుబల్లి, దామరమడుగు ప్రాంతాల్లోని పలు కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్


పోలింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. ఓటర్లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని గుర్తింపుపత్రాలతోఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి ఇప్పటికే బాధ్యతలు కేటాయించి, పోలింగ్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

మొత్తంగా బుచ్చి మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలనుప్రశాంతంగా,పారదర్శకంగానిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది. ఓటర్ల తీర్పుతో అభ్యర్థుల భవితవ్యం తేలనుండటంతో రాజకీయ వర్గాల్లోనూ ఎన్నికల ఫలితాలపై ఆసక్తి నెలకొంది.

వ్యాసరచనలు మొదటి స్థానం ఈ.ముజఫర్ అలీ.

పెన్ పవర్ రొంపిచర్ల మండలం నవంబర్ 4

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర ,రొంపిచర్ల నుండి ఈ.ముజఫర్ అలీ నియోజకవర్గ స్థాయిలో మొదటి స్థానాన్ని సొంతం చేసుకొన్నాడు.నిన్న బసవ రాజు ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో మండల విద్యాశాఖ అధికారి నటరాజ రెడ్డి ఆధ్వర్యంలో వక్తృత్వ,వ్యాసరచన మరియు క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది.ఇందులో మొదటి స్థానంలో వచ్చిన విద్యార్థి, ఆంధ్రప్రదేశ్ అమరావతి లో జరిగే మాక్ అసెంబ్లీ నిర్వహణ లో పాల్గొనడం జరుగుతుంది మరియు నియోజకవర్గ స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రొంపిచర్ల రెండవసారి ఎంపిక కావడం పట్ల మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మమ్మ అమరా నాయక్,రఫి బాషా విజయలక్ష్మి మరియు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు.



సుస్థిర జీవన విధానంపై విద్యార్థులకు అటవీ శాఖ అవగాహన





-చిరుధాన్యాల ప్రాధాన్యత, ఆహార వృథా నివారణపై ప్రత్యేక కార్యక్రమం

గంగవరం, పెన్ పవర్: నవంబర్ 4:

భారత్‌లో ఈ ఏడాది నిర్వహించనున్న బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో ప్లాస్టిక్ రహిత అడవులు, పర్యావరణహిత జీవన విధానాలను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నవంబర్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వారం రోజులపాటు ప్రతిరోజూ ఒక్కో అంశంపై ప్రజలు, విద్యార్థులు, రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు రంపచోడవరం అటవీ డివిజన్ పరిధిలోని ఫోక్స్‌పేట రేంజ్ అటవీ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో గంగవరం ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా చిరుధాన్యాలు, తృణధాన్యాలతో ఆరోగ్యకరమైన జీవన విధానం, ఆహారాన్ని వృథా చేయకుండా వినియోగించడం, ఆహార వ్యర్థాలను తగ్గించడం, అటవీ ఉత్పత్తుల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల చిరుధాన్యాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపిస్తూ వాటి ప్రాధాన్యత, పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను అటవీ సిబ్బంది వివరించారు. అలాగే ఆహార పదార్థాలను అవసరానికి తగినంత మాత్రమే వినియోగించాలని, మిగిలిన ఆహారాన్ని వృథా చేయకుండా చూడాలని సూచించారు. అటవీ ఉత్పత్తులను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ ప్రకృతి వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణహిత జీవన విధానాన్ని అలవర్చుకోవడంతో పాటు ప్రకృతి సంపదను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.


ఫోక్స్‌పేట రేంజ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల బోధనా సిబ్బందితో పాటు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎస్. వరలక్ష్మి, వి. వెంకటరాజు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పద్మ, సుభద్ర, అరుణ, రమణ, ప్రశాంత్ కుమార్, మాణిక్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈసీ నిబంధనలు, మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయకుమార్

విజయవాడ, పెన్ పవర్,నవంబర్ 04:

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల వ్యయ నివేదికల సమర్పణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయకుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం నిబంధనలు,మార్గదర్శకాలనుతప్పనిసరిగా పాటించాలనిసూచించారు.బుధవారంవిజయవాడలోని తన కార్యాలయం నుంచి సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు, జిల్లా నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ అనంతరం సమర్పించాల్సిన ఎన్నికల వ్యయ నివేదికల తయారీ, వివరాల నమోదు, పరిశీలనపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

అభ్యర్థులపై అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలు, పెండింగ్ కేసులు, నగదు, మద్యం, ఇతర వస్తువుల స్వాధీనాలు, పెయిడ్ న్యూస్ అంశాలను సమగ్రంగా నమోదు చేయాలని తెలిపారు. బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపుల ఖర్చులు, అభ్యర్థుల రోజువారీ వ్యయ రిజిస్టర్లు, రాజకీయ పార్టీల ఖర్చులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్ బృందాలు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తూ, రోజువారీ రికార్డులను సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన ప్రతి అంశాన్ని పారదర్శకంగా నమోదు చేసి, తగిన ఆధారాలతో నివేదికలను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.పోలింగ్ పూర్తయిన అనంతరం నిర్దేశిత గడువులోగా సంతకం చేసిన ఎన్నికల వ్యయ నివేదికలను సమర్పించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయకుమార్ అధికారులకు సూచించారు.



పులివెందుల ప్రజలు వైసీపీని గుబ గుయ్ అనేలా కొట్టారు..రాచకొండ లక్ష్మయ్య

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 4,

ఈరోజు గుంటూరు కార్పొరేషన్ మేయర్ గా ఎన్నికైన సందర్భంగా ఈరోజు మేయర్ లక్ష్మీ అపర్ణ కోవెలమూడి గారినీ కలిసి వారిని శాలువాతో సన్మానించడం జరిగినది, ఈసందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ పులివెందల నియోజకవర్గంలో వైయస్ రాజారెడ్డి గారు బతికి ఉన్నంగా ఎలక్షన్ జరగలేదు, మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఉన్నన్నాళ్ళు ఎలక్షన్ జరగలేదు, ఆ తర్వాత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత కూడా ఎలక్షన్ జరగలేదు ఇప్పుడికి 40 సంవత్సరాలు ఈరోజు అక్కడ ప్రజలు స్వచ్ఛందంగా ఎవరికి కావాలంటే వారికి ఓటు వేసుకునే

ఎలుసుబాటుకల్పించినఘనతమనముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు గారి ది ఏరోజైనాకడప జిల్లాలో పులివెందుల నియోజకవర్గం అంటే ఎంతో ప్రాధాన్యత గల నియోజవర్గం అలాంటి

?పులివెందులలో 40 వార్డులకు కాను కూటమి ప్రభుత్వం 37 స్థానాలు గెలుచుకుంది పులివెందుల నియోజకవర్గంలో ప్రజలు ఎప్పుడు ఎలక్షన్ వచ్చినా కూడా ఓటు వేసి వేరొకరు అక్కడ మేయర్ గా ఎమ్మెల్యేగా నుంచున్న అభ్యర్థులు మాత్రమే ఓట్లు వేసుకుంటారు,గత 40 ఏళ్లుగా ఉన్న వైఎస్సార్ వర్గీయుల



భయం తొలగిపోవడంతో ప్రజలు స్వేచ్ఛగా వచ్చి ఓటు వేసి ఈ విజయాన్ని అందించారు.,

ఎన్నికలను అడ్డుకోవడానికి వైసీపీ నాయకులు కోర్టులకు వెళ్లడం, ధర్నాలు చేయడం వంటి అనేక డ్రామాలు ఆడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ను రప్పించి హెలికాప్టర్ డ్రామాలు ఆడించడమే కాకుండా, కౌంటింగ్ ఏజెంట్లను వెనక్కి పిలిపించుకుని తప్పుడు ప్రచారం చేశారు.,?పులివెందుల ప్రజలు ఓటు అనే ఆయుధంతో వైసీపీ నాయకుల గూబ గుమమనేలా గట్టిగా కొట్టేశారు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు

గుంటూరు నగర ప్రజలకు కూటమి నేతల కృతజ్ఞతలు

గుంటూరు, పెన్ పవర్ నవంబర్ 4:

గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి బలపరిచిన మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులు ఘన విజయంసాధించినసందర్భంగాస్థానికక్యాపిటల్‌హోటల్‌లో బుధవారంఆత్మీయసమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈసందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, కూటమికి అఖండ విజయాన్ని అందించిన గుంటూరు నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు అప్పగించిన బాధ్యతను గౌరవిస్తూ పారదర్శకమైన ప్రజాపాలన అందిస్తామని, వైసీపీ అభ్యర్థులు గెలిచిన డివిజన్లలోనూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించామని పేర్కొన్నారు.రామాంజనేయులుమాట్లాడుతూ, ప్రధానమంత్రినరేంద్రమోదీ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌తో పాటు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషి కూటమి విజయానికి





దోహదపడిందన్నారు. మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, కార్పొరేటర్లకు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ ఎన్నికలు నిర్వహించిందన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ, నగర ప్రజలు అందించిన విజయాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి గడపలోని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

జనసేన నాయకుడు కిలారి రోశయ్య మాట్లాడుతూ, కూటమిపై ప్రజలకు ఉన్న నమ్మకం ఈ ఎన్నికలతో మరోసారి రుజువైందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపట్టిన అభివృద్ధి విజయానికి కారణమన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గుంటూరులో అభివృద్ధిని వేగవంతం చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, నూతన మేయర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

విజయవాడ, పెన్ పవర్,నవంబర్ 4:

ఎన్టీఆర్ జిల్లాలో ఈ నెల 5న నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.

బుధవారంవిజయవాడలోనిజిల్లాపరిషత్‌కార్యాలయంలో జెడ్పీ సీఈవో పి. సుశీలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 992 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 16 జెడ్పీటీసీ స్థానాలకు 55 మంది, 276 ఎంపీటీసీ స్థానాలకు 631 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని వెల్లడించారు. జిల్లాలో మొత్తం 8 లక్షల 35 వేల 515 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల కోసం 1,324 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,283 మంది సహాయ ప్రిసైడింగ్



అధికారులు, 3,959 మంది ఇతర పోలింగ్ సిబ్బందిని సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. 496 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, 291 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల పర్యవేక్షణకు 205 మంది వీడియోగ్రాఫర్లు, 191 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు తెలిపారు.పోలింగ్ నిర్వహణ కోసం 89 రూట్లు, 45 జోన్లు ఏర్పాటు చేసి, 188 బస్సులను ఎన్నికల సిబ్బంది, సామగ్రి తరలింపునకు కేటాయించినట్లు వివరించారు. దివ్యాంగ ఓటర్ల కోసం వీల్‌చైర్లు, ఓటర్ల సౌకర్యార్థం తాగునీరు, నీడ, వైద్య శిబిరాలు, సహాయ కేంద్రాలు, అవసరమైన క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ కోసం జిల్లా కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.

గణపవరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 04:

తుపాను అనంతర పరిస్థితులపై సమీక్షలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణను పరిశీలించిన ఆయన, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మరియు వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. తుపాను ప్రభావంతో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున, ప్రజలకు అవసరమైన అత్యవసర ఔషధాలను సిద్ధంగా ఉంచాలని, వైద్య సేవల విషయంలో బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

కూటమిపై ప్రజలు ఉంచిన నమ్మకానికి నిదర్శనం -- ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు

గుంటూరు, పెన్ పవర్,నవంబర్ 4:



గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడం ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు అన్నారు. 11 డివిజన్లలో 10 స్థానాలు కైవసం చేసుకుని 91 శాతం విజయం సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.
గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో విజయం సాధించిన మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ఈ విజయానికి ప్రధాన కారణమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకత్వ సహకారం, కార్యకర్తల కృషి విజయానికి దోహదపడ్డాయని తెలిపారు.
కష్టపడిన నిజమైన కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వైట్ కాలర్ బ్రోకర్లకు దూరంగా ఉండాలని సూచించారు. గెలిచిన కార్పొరేటర్లు ప్రతీకార రాజకీయాలకు దూరంగా ఉంటూ ప్రజాసేవకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. ఓడిపోయిన అభ్యర్థులను కలుపుకొని ముందుకు సాగాలని, 2029 ఎన్నికలే లక్ష్యంగా కూటమి నాయకులు ఐక్యంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ల కార్పొరేటర్లు, 36వ డివిజన్ అభ్యర్థి దాసరి అనిల్ కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే నా ధ్యేయం.. 43వ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 4,



గుంటూరు నగరంలో నిన్న కురిసిన భారీ వర్షం నేపథ్యంలో 43వ డివిజన్ కార్పొరేటర్ రంగావజ్జుల గాయత్రి డివిజన్ పరిధిలోని పొట్టి శ్రీరాములు నగర్‌లో మురుగు కాలువలు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. వర్షం కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొన్న సమస్యలనుఅడిగితెలుసుకున్నారు.ప్రజలకుఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.
ఈ సందర్భంగా కార్పొరేటర్ రంగావజ్జుల గాయత్రి మాట్లాడుతూ.. కూటమి నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో ప్రజలు తనను మంచి మెజారిటీతో గెలిపించారని తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా 43వ డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ప్రజలసమస్యలనుపరిష్కరించడమే తన ప్రధాన ధ్యేయమని, అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. డివిజన్‌లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి, మేయర్ సహకారంతో సమస్యలుపరిష్కారమయ్యేలాకృషిచేస్తాననివెల్లడించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలపాటి రవికుమార్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, టీడీపీ, జనసేన నాయకులు రామినేని రవీంద్ర, లక్ష్మయ్య, మైనం లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, తుర్లపాటి ఉదయ భాస్కర్, శేషుబాబు, మైనం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన గుంటూరు జిల్లా కలెక్టర్

గుంటూరు, పెన్ పవర్,నవంబర్ 4:



మురసు తుఫాను ప్రభావంతో వరద ముంపునకు గురైన పెదనందిపాడు, కాకుమాను, ప్రత్తిపాడు మండలాల్లో గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ బుధవారం పర్యటించారు. ఉధృతంగా వరద ప్రవాహం కొనసాగుతున్నప్పటికీ ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహకారంతో పెదనందిపాడు ప్రాంతానికి చేరుకున్న కలెక్టర్, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి ప్రజల ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్నారు. నల్లమడ వాగు ప్రవాహ ఉధృతిని పరిశీలించి, ప్రజలు పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వరద ప్రభావిత గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రజలను అప్రమత్తం చేస్తూ వాగుల వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట స్థానికంగా ఆహార ఏర్పాట్లు చేయాలని సూచించారు. జలవనరుల శాఖ అధికారులు వాగు ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.
జిల్లాలో ఇప్పటివరకు 23 గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాల్సి ఉందని, ఆ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. వరద ముంపు, తుఫాను ప్రభావాన్ని అంచనా వేసేందుకు డ్రోన్ల ద్వారా పరిశీలన చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో తుఫానులు, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా రహదారులు, వాగుల ఆధునీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల సిబ్బంది రాకపోకలపై ప్రత్యేక నిఘా కాకుమాను, ఫిరంగిపురం, పెదనందిపాడు మండలాల్లో ఎన్నికల సిబ్బంది రాకపోకలను నిరంతరం గమనించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాలకు వెళ్లే రహదారుల పరిస్థితిని పూర్తిస్థాయిలో పరిశీలించాలని, అవసరమైతే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గురువారం సాయంత్రం వరకు ఆయా బృందాలను స్థానికంగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో 13 మండలాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్నాయని, నవంబర్ 5వ తేదీ



గురువారం పోలింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 13 జెడ్పీటీసీ, 200 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, 7 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయని, మిగిలిన 193 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు.జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఓటర్లు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ కోరారు. ఈ పర్యటనలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి. శ్రీనివాస్, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకటరత్నం తదితర అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల క్లోరినేషన్



గుంటూరు,పెన్ పవర్,నవంబరు 4 :

మురసు తుఫాను ఉధృతి కారణంగా వరద ప్రభావం ఎక్కువగా ఉండటంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ ముందస్తు ఆదేశాల మేరకు తుఫాను తగ్గుముఖం పట్టిన వెంటనే తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో తాగునీటి పథకాలకు తక్షణం క్లోరినేషన్ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టింది. నిమ్మగడ్డ వారి పాలెం, తాడికొండ మండలం కంతేరు, మేడికొండూరు మండలం విసదల, మందపాడు, భీమునివారి పాలెం., సౌపాడు, నారాకోడూరు, పేరేచర్ల తదితర నీటి పథకాలకు క్లోరినేషన్, సూపర్ క్లోరినేషన్ చేపట్టారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి నేతృత్వంలో అధికారులు సిబ్బంది ప్రతి నీటి పథకాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఎక్కడ కలుషితం కాకుండా గమనిస్తున్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ తుఫానుకు ముందుగానే జిల్లా కలెక్టర్ నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ముందుగానే అన్ని నీటి పథకాలు పూర్తిగా నింపి ఉంచడమే కాకుండా తరువాత క్రమంలో కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలకు సురక్షిత నీటిని అందించుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పరిస్థితుల కారణంగా ప్రజలు నీటిని బాగా మరగకాచి చల్లార్చి తాగాలని విజ్ఞప్తి చేశారు.

పదవిని బాధ్యతగా భావించండిఎమ్మెల్యే నసీర్

గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 4,



నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందిస్తూ నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. బుధవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ను నూతనంగా ఎన్నికైన నియోజకవర్గ కార్పొరేటర్లు వచ్చి కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి కార్పొరేటర్లను గెలిపించారని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేయాలని సూచించారు. ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ కలిసికట్టుగా అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గంలో 400 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్పొరేటర్లు ముందంజలో ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎదురయ్యే ప్రతి సమస్యనూ ప్రభుత్వాధికారులు దృష్టికిగానీ, మా దృష్టికిగానీ వెంటనే తీసుకురావాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందేలా చూడాల్సిన బాధ్యత కార్పొరేటర్లదేనని స్పష్టం చేశారు . పదవి అనేది బాధ్యత మాత్రమేనని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అన్నారు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే నసీర్ సారథ్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

మురసా ప్రభావం.. జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను : ప్రత్తిపాటి

విద్యుత్ శాఖకు రూ.600 కోట్ల మేర నష్టం వాటిల్లింది : మంత్రి గొట్టిపాటి

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 04:



మురసా ప్రభావంతో నియోజకవర్గంలో ఎక్కువ నష్టం జరిగిందని, ముఖ్యంగా రైతాంగానికి పూడ్చలేని విధంగా భారీ నష్టం వాటిల్లిందని, పత్తి, మిరప, వాణిజ్యపంటలు నీళ్లలో తేలుతున్న దృశ్యాలు చూస్తుంటే బాధ కలిగిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. బుధవారం ప్రత్తిపాటి, పల్నాడు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి, విద్యుత్ శాఖా మాత్యులు గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లాతో కలిసి చిలకలూరిపేట నియోజకవర్గంలో మురసా తుపాన్ ధాటికి నీటమునిగిన ప్రాంతాలు, పొలాలను పరిశీలించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి, మంత్రి పలుచోట్ల ప్రజలు, రైతులతో మాట్లాడి, వారికి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు.తుపానుబాధితులనిర్వాసిత కేంద్రాలకు వెళ్లి, వారి సమస్యలు తెలుసుకున్న అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు.
విద్యుత్ శాఖకు రూ.600 కోట్లవరకు నష్టం : మంత్రి గొట్టిపాటిఅర్నబ్‌తుపానుప్రభావంనుంచికోలుకోకముందే రాష్ట్రంపై మురసా విరుచుకుపడిందని, ఒంగోలు సమీపంలో తీరందాటాక, చిలకలూరిపేటపై ఎక్కువ ప్రభావం పడిందని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అర్నబ్ తుపాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి అంబేద్కర్ కోనసీమ వరకు విద్యుత్ వ్యవస్థ బాగా దెబ్బతిందన్నారు. ఇంతటి విపత్కర పరిస్థుతుల్లోనూ విద్యుత్ సిబ్బంది సమర్థవంతంగా పనిచేశారని గొట్టిపాటి చెప్పారు. అర్నబ్, మురసా ప్రభావంతో రాష్ట్రంలో 10వేలకు పైగా కరెంట్ స్తంభాలు నేలకొరిగాయని, వందల కిలోమీటర్ల మేర లైన్లు దెబ్బతిన్నాయని మంత్రి తెలిపారు. తుఫాన్ల నష్టంతో రాష్ట్ర విద్యుత్ శాఖకు రూ.500 నుంచి 600 కోట్ల వరకు నష్టం వాటిల్లిందన్నారు.
చిలకలూరిపేటలో అర్ధరాత్రి కూడా విద్యుత్ సిబ్బంది పనిచేశారని, బుధవారం సాయంత్రానికి అన్నిచోట్ల విద్యుత్ పునరుద్ధరణ పూర్తవుతుందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. సకాలంలో స్పందించి వేగంగా విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టిన యంత్రాంగాన్ని, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు మంత్రి చెప్పారు.జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతాను : ప్రత్తిపాటి
మురసా తుపాను ప్రభావంతో గత 30 ఏళ్లలో ఎన్నడూ జరగనంత నష్టం నియోజకవర్గంలో జరిగిందని, తీరం దాటాక నాలుగ్గంటలపాటు చిలకలూరిపేటపై కుంభవృష్టి కురిసిందని, నా రాజకీయ జీవితంలో ఇంత తీవ్రనష్టాన్ని చూడలేదని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోనే 600కు పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, రైతాంగానికి పూడ్చలేని నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా పత్తి, మిరప, ఉద్యానపంటలు నీటమునిగాయన్నారు. తుపాను తీవ్రతను గమనించి ప్రభుత్వం, యంత్రాంగం ముందే ప్రజల్ని హెచ్చరించిందని, దాంతో చాలావరకు ప్రాణ నష్టం తగ్గిందన్నారు. నియోజకవర్గంలో ఇద్దరు మరణించారని ప్రభుత్వపరంగా వారి కుటుంబాలను ఆదుకుంటామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో జరిగిన నష్టాన్నిముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే స్పష్టంచేశారు.పట్టణంలో పలువార్డులు నీటమునిగాయని, వెంటనే ప్రజల్ని నిర్వాసిత కేంద్రాలకు తరలించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు, సమర్థ పనితీరువల్లే రాష్ట్రంలో మురసా ప్రభావ నష్టాన్ని తగ్గించగలిగారని ప్రత్తిపాటి తెలిపారు. నియోజకవర్గానికి భవిష్యత్ లో వరద ముప్పు లేకుండా ఉండాలంటే వెంటనే, ప్రధాన వాగులైన కుప్పగంజి, ఓగేరు, నక్క వాగుల్ని ఆధునీకరించాలని ప్రత్తిపాటి తెలిపారు. ప్రవాహానికి అడ్డుగా ఉన్న కంపచెట్లు, పూడికను తొలగించి, మూడు వాగుల్ని విస్తరిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. వాగుల సమస్యను ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఇన్ చార్జ్ మంత్రి గొట్టిపాటికి తెలియచేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తోట రాజారమేష్, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు ముల్లా కరిముల్లా, మద్దిబోయిన శివ, షేక్ మస్తాన్ వలి, టీడీపీ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపు వెంటనే ప్రజల మధ్యకు.. 41వ వార్డు సమస్యలపై గాయత్రి బెహరా దృష్టి



గుంటూరు:పెన్ పవర్, నవంబర్, 4

నిన్న కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే నేడు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ 41వ వార్డు కార్పొరేటర్, భారతీయ జనతా పార్టీ మూడో మండల అధ్యక్షురాలు గాయత్రి బెహరా.
భారీ వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న పీకల వాగు ప్రాంత ప్రజలను ఆమె పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత మున్సిపల్ అధికారులను పిలిపించి, తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా గాయత్రి బెహరా మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఎంతో నమ్మకంతో మంచి మెజారిటీతో గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.ఈ పర్యటనలో బీజేపీ మూడో మండల ప్రధాన కార్యదర్శి జంధ్యాల పవన్ కుమార్, బీజేపీ నాయకులు స్వరూప రాజ్, టీడీపీ 41వ డివిజన్ అధ్యక్షులు లలితా శాస్త్రి, ప్రధాన కార్యదర్శి హుస్సేన్, గద్దం శీను, గురు లక్ష్మి, దేగల శీను, క్రాంతి, జనసేన నాయకులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం తప్పింది: లింగుంట్ల బ్రిడ్జి వద్ద రాకపోకలకు ఇబ్బందులు

చిలకలూరిపేట , పెన్ పవర్, నవంబర్ 04:



చిలకలూరిపేట – నరసరావుపేట ప్రధాన రహదారిపై లింగుంట్ల బ్రిడ్జి సమీపంలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పూర్తి లోడుతో వెళ్తున్న ఐషర్ మినీ లారీ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మట్టిలోకి దూసుకెళ్లి కూరుకుపోయింది. ఈ ఘటనలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పినప్పటికీ, వాహనం రోడ్డును ఆనుకుని కూరుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు, ప్రక్కగా వచ్చే వాహనాలు వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .

పేద విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య

పి-4 కార్యక్రమంలో భాగంగా బీటెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్, మరో 18మంది విద్యార్థుల విద్యా ఖర్చులకు ఆర్థికసాయం

పెన్ పవర్ కారంపూడి వెంకటేష్ పెనుగొండ్ల నవంబర్ 4:--



పేదరికం ఉన్నత చదువులకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతోముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు పి-4 (P4) కార్యక్రమంలో భాగంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య పేదవిద్యార్థులవిద్యాభివృద్ధికి చేయూత అందిస్తున్నారు. కారంపూడి మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ధూళిపాళ్లనాగేశ్వరరావుకుమారుడుఉమామహేశ్వరరావు ప్రస్తుతం బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు పంగులూరి అంజయ్య ముందుకొచ్చి విద్యార్థికి చదువుకు అవసరమైన ఖర్చులతో పాటు ల్యాప్‌టాప్‌ను అందించి ఆర్థికంగా అండగా నిలిచారు.
ఉమామహేశ్వరరావుతో పాటు మరో 18 మంది పేద విద్యార్థుల చదువులకు అయ్యే ఖర్చులను సైతం పంగులూరి అంజయ్య భరిస్తూ వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ఆయన చేస్తున్న ఈ సహాయం అభినందనీయం.విద్యార్థులభవిష్యత్తుకుభరోసా కల్పిస్తూ, ఆర్థిక పరిస్థితులు చదువుకు అడ్డంకి కాకుండా ప్రోత్సహిస్తున్న పంగులూరి అంజయ్య సేవలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నాయి

పోలింగ్ కేంద్రాల వద్ద వర్షపు నీరు నిలవకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కలెక్టర్ జి. లక్ష్మీశ

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 4,



భారీ వర్షాల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సూచించారు. ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్, పోలింగ్ కేంద్రాల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అధికారులందరూ క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి వర్షానికి తడవకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.వాగులు, వంకలు పొంగే ప్రాంతాల్లో ఎన్నికల సిబ్బంది రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఎన్నికల వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడకుండా క్రేన్లు, జేసీబీలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.పోలింగ్ సిబ్బంది, పోలీసు సిబ్బందికి భోజనం, వైద్య సేవలు, కనీస సౌకర్యాల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ముంపు ప్రాంతాలు, ఏటిగట్ల వెంబడి రెవెన్యూ అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైన చోట డ్రోన్లను వినియోగించాలని సూచించారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న ప్రజలను గుర్తించి, వారిని వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు.

భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేలా అధికారులందరూ పూర్తి అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ స్పష్టం చేశారు.

కొల్లిపర మండలంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పెమ్మసాని పర్యటన

గుంటూరు:పెన్ పవర్, నవంబర్, 4



రెండు తుఫాన్ల కారణంగా పంట నష్టపోయిన రైతులకు గరిష్ఠ స్థాయిలో సహాయం అందిస్తామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం కొల్లిపర మండలంలోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి పర్యటించి, నీట మునిగిన పొలాలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో పట్టిసీమ నీరు అందడంతో ఈ ఏడాది ఎకరానికి 50 బస్తాల వరకు వరి దిగుబడి వచ్చిందన్నారు. ధాన్యానికి మంచి ధర లభిస్తున్న సమయంలో ఆర్గన్, మురస్ తుఫాన్ల కారణంగా వరి, మినుము, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇప్పటికే రూ.20 వేల సాయం అందిస్తుండగా, అదనంగా ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందిస్తామని తెలిపారు. పంట నష్టం ఎన్యూమరేషన్‌ను 48 నుంచి 72 గంటల్లో పూర్తి చేసి, ఏ ఒక్క రైతును మిస్ కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

కౌలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా భూయజమానులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రైతులు పంటల బీమాపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.



వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. కేంద్రం నుంచి కూడా గరిష్ఠ సహాయం తీసుకొచ్చి నష్టపోయిన రైతులను ఆదుకుంటామని పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

జనసేన పార్టీ నూతన కార్పొరేటర్లకు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు అభినందనలు



గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 4,

గుంటూరు నగరంలో జనసేన పార్టీ తరఫున నూతనంగా కార్పొరేటర్లుగా ఎన్నికైన 67వ డివిజన్ కార్పొరేటర్ కొండూరు సమత, 19వ డివిజన్ కార్పొరేటర్ దాసరి లక్ష్మీ దుర్గ , 28వ డివిజన్ కార్పొరేటర్ దొంత హైమావతి , 73వ డివిజన్ కార్పొరేటర్ ఐసెట్టి కనకదుర్గ ,37వ డివిజన్ కార్పొరేటర్ మధు లాల్ ,24వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ గుంటూరు జిల్లా జనసేన పార్టీకార్యాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లాఅధ్యక్షులుగాదెవెంకటేశ్వరరావునిమర్యాదపూర్వ కంగాకలిసివారిఆశీస్సులు తీసుకున్నారు.నూతనంగా ఎన్నికైనకార్పొరేటర్లకుగాదెవెంకటేశ్వరరావుహృదయ పూర్వక అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో ప్రజలకు అందుబాటులో ఉంటూ డివిజన్ల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

మేయర్ కు కేంద్ర మంత్రి పెమ్మసాని అభినందనలు



గుంటూరు:పెన్ పవర్, నవంబర్, 4,

నగరకార్పొరేషన్ మేయర్‌గా లక్ష ఓట్లకు పైగామెజారిటీతో నూతనంగా ఎన్నికైన కోవెలమూడిలక్ష్మీఅపర్ణ ని, గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసానిచంద్రశేఖర్‌నిమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ లక్ష్మీ అపర్ణకుపెమ్మసానిశుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈసందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్నినిలబెట్టుకుంటూ నగర అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. నగర ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి,సంక్షేమకార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలనిసూచించారు.అనంతరం మేయర్ లక్ష్మీ అపర్ణ స్పందిస్తూ పెమ్మసాని కి ధన్యవాదాలు తెలియజేశారు.

జి.కొండూరు మండలం వెలగలేరు రెగ్యులేటర్ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ.

విజయవాడ, పెన్ పవర్, నవంబర్, 4,



గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలోఅప్రమత్తమైనజిల్లాయంత్రాంగం. బుడమేరు పరివాహక ప్రాంతాల్లో వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడుపర్యవేక్షణచేపడుతున్నఅధికారులు. వెలగలేరు రెగ్యులేటర్ వద్ద ప్రస్తుత నీటి ప్రవాహం సాధారణ స్థాయిలోనే కొనసాగుతుందని వెల్లడించిన అధికారులు. భారీ వర్షాల నేపథ్యంలో బుడమేరు వరద ఉధృతిని నిరంతరం అంచనా వేస్తున్న జిల్లా యంత్రాంగం. లోతట్టు ప్రాంతాల్లో ముంపు పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు. ప్రజలకుఎలాంటిఇబ్బందులుకలగకుండా అప్రమత్తంగా ఉండాలని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు. వరద పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ.. ప్రజల భద్రతే లక్ష్యంగా ముందస్తు చర్యలు చేపడుతున్న ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం.

నగర పాలక సంస్థ ఎన్నికల్లో గెలిచిన ఎన్డీయే అభ్యర్థులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి దిశానిర్దేశం



గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 4,

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. బుధవారం గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎన్డీయే కూటమి అభ్యర్థులు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మర్యాదపూర్వకంగా కలుసుకొని, తమ గెలుపునకు అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజేతలందరినీ ఘనంగా సత్కరించి, ప్రత్యేక అభినందనలు



శుభాకాంక్షలు అందజేశారు. కూటమి అభ్యర్థులపై అపారమైన నమ్మకంతో గెలిపించిన నగర ప్రజలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధన్యవాదాలు తెలుపుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ డివిజన్లలోని సమస్యల పరిష్కారానికి, సమగ్ర అభివృద్ధికి నిరంతరం అంకితభావంతో పనిచేయాలని కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. అలాగే కూటమి భాగస్వామ్య పక్షాలు పరస్పర సమన్వయంతో, ఐక్యంగా పనిచేస్తూ ప్రజా సంక్షేమ పాలనను ప్రతి ఇంటికీ చేర్చాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

జెడ్..పీ.టీ.సీ, ఎం.పీ.టీ.సీ ఎన్నికలకు సిద్ధం..



గుంటూరు, పెన్ పవర్,నవంబరు 4 :

జెడ్.పీ.టీ.సీ, ఎం.పీ.టీ.సీ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసి సిద్ధంగా ఉంది. గురువారం జిల్లాలో 13 మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. 13 జెడ్పీటీసీ, 2 వందల ఎంపిటిసి స్థానాలు జిల్లాలో ఉన్నాయి. ఏడు ఎంపిటిసి స్థానాలు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 193 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి.

బుధవారం మండల కేంద్రాల్లో పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నికల సిబ్బంది పంపిణీ కేంద్రాలకు సకాలంలో చేరుకుని ఎన్నికల సామగ్రి స్వీకరించారు. పంపిణీ కేంద్రాల వద్ద రూట్ ల వారిగా సామగ్రి పంపిణీ ఏర్పాటు చేశారు. పోలింగ్ 5వ తేదీన జరుగుతుండగా, కౌంటింగ్ 7వ తేదీన జరుగుతుంది. గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలోగల మండలాలకు సంబంధించిన కౌంటింగ్ ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలోనూ, తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలో గల మండలాలకు సంబంధించిన కౌంటింగ్ తెనాలి గల వి.ఎస్.ఆర్ కళాశాలలో జరుగుతుంది.



ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జ్యోతి బసు, రిటర్నింగ్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పర్యవేక్షించారు.

జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా జరుగుటకు అన్ని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఓటర్లు తమ అమూల్య

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం!

కంకిపాడులో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సామగ్రి పంపిణీ పూర్తి

70 పోలింగ్ కేంద్రాలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్నికల విధుల్లో 400 మంది సిబ్బంది

వెల్లడించిన ఎన్నికల అధికారి శ్రీనివాసరావు

పెన్ పవర్ కృష్ణా జిల్లా, కంకిపాడు నవంబర్ 4



కంకిపాడు:మండలంలోఎంపీటీసీ,జెడ్పీటీసీఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.మండలకేంద్రంలోని కల్యాణ మండపంలో ఎన్నికలఅధికారిశ్రీనివాసరావుఆధ్వర్యంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విజయవాడ--మచిలీపట్నం పాత రోడ్డులోని కల్యాణ మండపానికి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని మార్చినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేపట్టామన్నారు.

మండల పరిధిలోని 20 సెగ్మెంట్లకు సంబంధించి మొత్తం 70 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఎన్నికల విధుల్లో సుమారు 400 మంది సిబ్బందిపాల్గొంటున్నారనివెల్లడించారు.

పోలింగ్‌కు అవసరమైన ఎన్నికల సామగ్రిని సిబ్బందికిపంపిణీచేసి,వాటినితనిఖీచేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. విధులకు హాజరైన సిబ్బందికి భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేశామన్నారు.అనంతరం రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో ప్రత్యేక బస్సుల ద్వారా పోలింగ్ సిబ్బందిని వారికి కేటాయించిన కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు.వర్షాల కారణంగా ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ ఎంపీడీవో, జోనల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతోఎన్నికలసామగ్రిపంపిణీప్రక్రియను విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. ఎన్నికలుప్రశాంతంగా,పారదర్శకంగానిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు వెల్లడించారు.

తుఫాను బాధితులకు అండగా నిలవాలి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు

చీరాల, నవంబర్ 4, (పెన్ పవర్) :

మురుసు తుఫాను ప్రభావంతో చీరాల నియోజకవర్గంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ఈ మేరకు నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ఈఎన్‌సీ, ఎస్‌ఈలతో మాట్లాడి విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించాలని ఆదేశించారు.

అదేవిధంగా తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు అండగా నిలవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి కాలనీలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భోజనం, తాగునీరు, వసతి వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పార్టీ శ్రేణులకు ఆదేశించారు.



జిల్లాలో 13 మండలాల్లో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



గుంటూరు, పెన్ పవర్,నవంబరు 4 :

ఈ నెల 5వ తేదీన యథావిధిగా కాకుమాను, పెదనందిపాడు,ఫిరంగిపురంమండలాల్లోజడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ మరియుజిల్లాఎన్నికలఅధికారిసి.యం.సాయికాంత్‌వర్మతెలిపారు. మురసు తుఫాను కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఉన్న దృష్ట్యా పోలింగ్ ను ఒక రోజు వాయిదా వేస్తున్నట్లు ముందుగా చెప్పడం జరిగిందని చెప్పారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేకంగాఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ తెలిపారు. మూడు మండలాల్లో జడ్పిటిసి, ఎంపీటీసీ పోలింగ్ ఈ నెల 5వ తేదీ గురువారం జరుగుతుందని, ఈ అంశాన్ని ప్రజలు, రాజకీయ పార్టీప్రతినిధులుగమనించిసహకరించాలనికోరారు.ఓటర్లుతమఅమూల్యమైనఓటుహక్కునువినియోగించు కోవాలని కోరారు. జిల్లాలో 13 మండలాల్లో ఎన్నికలు జరుగుతాయని, ఐదవ తేదీ, గురువారం పోలింగ్ జరుగుతుందని తెలిపారు. 13 జెడ్పీటీసీ, 2 వందల ఎంపిటిసి స్థానాలు ఉన్నాయన్నారు. ఏడు ఎంపిటిసి స్థానాలు ఏకగ్రీవం అయ్యాయని, మిగిలిన 193 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా జరుగుటకు అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.

30వ డివిజన్ కార్పొరేటర్ ఆళ్ళ శిరీషతో ప్రముఖ నాయకులు..



గుంటూరు, పెన్ పవర్, నవంబర్, 4,

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళ మాధవి, జిల్లా జనసేన నాయకులు కిలారీ రోశయ్యలతో 30వ డివిజన్ కార్పొరేటర్ ఆళ్ళ శిరీష సమావేశమయ్యారు.ఈ సందర్భంగా నాయకులతో పలు అంశాలపై చర్చించారు. గుంటూరు నగర అభివృద్ధి, డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై చర్చించినట్లు తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని నాయకులు సూచించారు. డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని కార్పొరేటర్ ఆళ్ళ శిరీష తెలిపారు.

ఎలా గెలవాలో చెప్పారు...జగన్ కంగ్రాట్స్ !



ఏపీలో చంద్రబాబు జగన్ ల మధ్య ఉన్నది కేవలం రాజకీయ వైరం అని ఎవరూ అనుకోరు. అది వ్యక్తిగత స్థాయిలో కూడా ఉందని భావించే వారూ నమ్మే వారూ ఉన్నారు. దానికి ఉదాహరణలు కూడా ఉన్నాయని చెబుతారు. ఈ ఇద్దరూ ఎక్కడా నేరుగా కలసిన సందర్భాలు లేవు, ఎవరు సీఎం గా ఉన్నా రెండవవారు ముఖం చాటేసే వైఖరినే ప్రదర్శిస్తూ వచ్చారు. అయితే సోషల్ మీడియా ద్వారా ఒకరి పుట్టిన రోజుకు మరొకరు శు భాకాంక్షలు మాత్రం చెప్పుకుంటారు. అంతవరకే అది. అలాంటిది నేరుగా చంద్రబాబుకు జగన్ కంగ్రాట్స్ చెబుతూ ట్వీట్ చేశారు అంటే అందులో చాలానే మ్యాటర్ ఉండాలిగా. అందుకే అంతా దాని గురించే విశ్లేషిస్తున్నారు.

జగన్ ఏమన్నారంటే :

కంగ్రాట్స్ చంద్రబాబు గారూ అంటూ ఏపీలో అర్బన్ బాడీస్ ఎన్నికల్లో సక్సెస్ తరువాత జగన్ ట్వీట్ చేశారు. ఇది అందరినీ ఆకట్టుకుంది. బాబు గెలుపుకి ఆయన అసలైన రాజకీయ ప్రత్యర్థి జగన్ ఎలా కంగ్రాట్స్ చెబుతారు అని అని ఆలోచించేవారే ఎక్కువ. మరి ఆ కంగ్రాట్స్ వెనకనే ఎన్నో సెటైర్లు ఎన్నో కామెంట్స్ దట్టించి మరీ జగన్ వదిలారు. అదే ఇపుడు రాజకీయంగా వైరల్ అవుతోంది. చంద్రబాబుని ని ఒక టీం గా జగన్ చేశారు. ఆ టీం లో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉంది, అలాగే పోలీసు యంత్రాంగం ఉంది. అలా టీం చంద్రబాబుకు జగన్ కంగ్రాట్స్ చెప్పారన్న మాట. ఇది సెటైరికల్ గా గట్టిగా గుచ్చుకోవాలని అలాగే చర్చ సాగాలనే జగన్ ఈ ట్వీట్ వేశారు అని అంటున్నారు.


చాన్స్ ఇవ్వలేదు :

అంతే కాదు ఎన్నికల్లో ఎలా గెలవాలో అన్నది బాబు అండ్ టీం క్లారిటీగా తెలియచెప్పింది అని జగన్ కామెంట్స్ చేశారు. అందులోనూ ప్రతిపక్షానికి పోటీ చేసేందుకు కనీసం అవకాశం ఇవ్వకుండా ఎలా చేయవచ్చూ ప్రతీ దశలోనూ చూపించారు అని కూడా కామెంట్స్ చేశారు. నామినేషన్ల దాఖలు దశ నుంచి హైజాక్ చేస్తూ వచ్చారని, స్క్రూటినీ, విత్ డ్రాయల్, పోలింగ్ ఏజెంట్లను బయటకు పంపించడం, రిగ్గింగ్ చేసుకోవడం, పోల్ పర్సెంటేజ్ ని కూడా మానేజ్ చేయడం, కౌంటింగ్ హైజాక్ చేయడం ఇవన్నీ కూడా గెలుపు ఎలా సాధించాలో చేసి చూపించారని జగన్ తన కంగ్రాట్స్ మెసేజ్ లోనే హాట్ కామెంట్స్ గా చెప్పుకొచ్చారు అన్న మాట.

ఎలక్షన్ కానే కాదు :

అందువల్ల అర్బన్ బాడీస్ కి జరిగినవి ఎన్నికలు కానే కాదని సెలెక్షన్ మాత్రమే అని జగన్ తేల్చేశారు. ప్రజలు ఎవరూ ఎన్నుకోలేదని కూడా జగన్ అంటున్నారు. ఇలాంటివి చూసినపుడు ఎన్నికల సంస్కరణల అవసరం ఎంత ఉందో మరింతగా అర్ధం అవుతోంది అన్నట్లుగా జగన్ మాట్లాడారు. మొత్తానికి ఒక వైపు అర్బన్ బాడీస్ లో కూటమి విజయ పరంపర కొనసాగింది. వైసీపీ దారుణంగా ఓటమిని అందుకుంది. దీనికి జగన్ నుంచి వచ్చిన రియాక్షన్ ఇలా షాకింగ్ గానే ఉంది. ఓటమి ఎపుడూ బాధాకరంగానే ఉంటుంది. ప్రత్యర్థి గెలుపుని కూడా తక్కువ చేసి చూడడం జరుగుతుంది. వైసీపీ విషయం తీసుకుంటే తమకు చాన్స్ ఇవ్వలేదని ఆరోపిస్తోంది. అదే సమయంలో ఏపీలో పారదర్శకంగానే ఎన్నికలు జరిగాయని అధికార పక్షం అంటోంది. ఈ రెండు కామెంట్స్ కి మధ్యలో ప్రేక్షకులు మాత్రం ప్రజలు. వారికి అన్నీ తెలుసు. ఎవరేమి మాట్లాడినా అందులో ఎంత మేరకు నిజం ఉంది అన్నది ఇంకా బాగా తెలుసు అంటున్నారు.

ఏపీలో మరో ఎన్నికల పోరు..!



ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసింది. కూటమి పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా విజయదుందుభి మోగించాయి. ఇక, ఈ పరంపరలో తాజాగా పరిషత్ ఎన్నికల పోలింగ్ కూడా వచ్చేసింది. ఇప్పటికే ప్రచారం కూడా పూర్తయిన ఈ ఎన్నికలు గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లోనూ కొన్ని చోట్ల ఏకగ్రీవాలు జరగ్గా.. మెజారిటీ ఎంపీటీసీ, జిల్లా పరిషత్ స్థానాల్లో కీలక పోరు సాగనుంది.తుఫాను నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేస్తారని.. బుధవారం ఉదయం వరకు ప్రచారం జరిగినా.. అలా ఏమీ లేదని ఎన్నికల సంఘం ప్రకటించింది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు యథావిధిగా నిర్వహించనున్నట్టు తెలిపింది. తుపాను ప్రభావంతో పలు ప్రాంతాల్లో వరదలు, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా తుపాను ప్రభావం, వరదల పరిస్థితులు, పోలింగ్ నిర్వహణకు ఎదురవుతున్న ఇబ్బందులపై సమీక్షించారు. చాలా జిల్లాల్లో వరదలు తగ్గుముఖం పట్టాయని, ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు లేవని కలెక్టర్లు నివేదించారు. కలెక్టర్ల నివేదికలను పరిశీలించిన అనంతరం, పరిస్థితులు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయాలని పునేఠా అధికారులను ఆదేశించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు కొనసాగనున్నాయి.

ఇక్కడ మాత్రమే..

మురసు' తుఫాన్ ప్రభావంతో కొన్ని మండలాల్లో ఎంపీటీసీ, జిల్లాల్లో జిల్లాపరిషత్ ఎన్నికలను వాయిదా వేశారు. గుంటూరు జిల్లాలోని పెదనందిపాడు, కాకుమాను, ఫిరంగిపురం మండలాల్లో జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడ్డాయి. అలానే బాపట్ల జిల్లా పరిధిలోని పరుచూరు సహా.. ఇతర మండలాల్లో పూర్తిగా ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో వరద పోటు పెరగడంతో ఎన్నికల సామగ్రిని సైతం అధికారులు ఆయా ప్రాంతాలకు పంపించలేని పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడ మాత్రమే ఎన్నికలను వాయిదా వేస్తూ.. నిర్ణయం తీసుకున్నారు.

నాన్నగారి ఆశయాలు నెరవేరుస్తా: రాధా ఫస్ట్ స్పీచ్



విజయవాడ కార్పొరేషన్ పరిధిలో జనసేన పార్టీ తరఫున మేయర్ అభ్యర్థిగా విజయం దక్కించుకున్న వంగవీటి రంగా వారసుడు వంగవీటి రాధాకృష్ణ.. తాజాగా మీడియా ముందుకు వచ్చారు. ఈ ఎన్నికల్లో విజయవాడలో 52 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. అయినప్పటికీ.. రాధాకు లక్షా 35 వేల ఓట్ల మెజారిటీ దక్కింది. వాస్తవానికి పోటీ కూడా తీవ్రంగానే సాగింది. ఇండిపెండెంట్ అభ్యర్థిగా దిగిన మాజీ ఐపీఎస్ ఏబీవీ గట్టి పోటీ ఇస్తారని అనుకున్నారు. ఇక వైసీపీ తరఫున మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి సైతం గట్టి పోటీనే ఇచ్చారు.

అయినప్పటికీ.. ప్రజలు మాత్రం రంగా వారసుడి వెంటే నిలిచినట్టు స్పష్టం అయింది. అదేసమయంలో కులాల కు, సామాజిక వర్గ పోరుకు భిన్నంగా కూడా ఈఎన్నికలు ప్రభావం చూపాయి. ఈ నేపథ్యంలో రాధా మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి రంగా ఆశీస్సులతోనే ఈ విజయం దక్కిందని భావిస్తున్నట్టు తెలిపారు. కూటమి పార్టీల నాయకులు తనకు అన్ని విధాలా సహకారం అందించారని.. ప్రతి ఒక్కరూ సహకరించారని తెలిపారు. విజయవాడ నగరంతోనే తమ కుటుంబ రాజకీయాలు ప్రారంభమయ్యాయన్నారు.

తన తండ్రి, తాను కూడా విజయవాడ నగర ప్రజలకు ఎంతో రుణపడి ఉన్నామన్న రాధా.. తండ్రి ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. అదేసమయంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ఈ విషయం ప్రజలదేనని వ్యాఖ్యానించారు. రంగా అభిమానులు, రాధా-రంగా మిత్రమండలి కూడా ఈ విజయానికి ఎంతో కృషి చేసినట్టు రాధా చెప్పారు. నగరంలో అనేక సమస్యలు ఉన్నాయని.. వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

సుదీర్ఘ విరామం..

రాధాకు సుదీర్ఘ విరామం తర్వాత.. ఈ విజయం దక్కడం గమనార్హం. 2004లో తొలిసారి విజయవాడ తూర్పు నుంచి ఆయన పోటీ చేసి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత.. పలు పార్టీలు మారి పోటీ చేసినా ఆయన విజయం దక్కించుకోలేదు. గత ఎన్నికల్లో అసలు టికెట్ కూడా దక్కలేదు. ఇక, తాజాగా జనసేన తీర్థం పుచ్చుకుని కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం దక్కించుకోవడంతో రంగా అభిమానులు.. పాతతరం నాయకులు కూడా రాధాను అభినందిస్తున్నారు.

రాప్తాడు నిందితుడిపై కాల్పుల కేసులో కీలక పరిణామం



అనంతపురం జిల్లా రాప్తాడులో నిందితుడు ఓ బాలికపై చేసిన దారుణ దాడికి యావత్ భారత్ కలకలం చెందింది. ప్రస్తుతం బాలిక బెంగళూరులో చికిత్స పొందుతోంది. ఇక రాప్తాడు నిందితుడిని అడవుల్లో పోలీసులు కాల్పులు జరపడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతడి కాలును తీసేయాల్సి వచ్చింది. అయితే అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సాగిన ఈ వ్యవహారంపై హైకోర్టులో పిటీషన్ దాఖలైంది.పోలీసులు నిందితుడిపై జరిపిన కాల్పులపై ఏపీ హైకోర్టులో ఓ న్యాయవాది పిటీషన్ దాఖలు చేయడంతో సంచలనమైంది. అతడిని ఆస్పత్రిలోకి ఈడ్చుకెళ్లిన వ్యవహారంపై స్వతంత్ర విచారణ జరిపించాలని కోరారు. నిందితుడిపై ఆరు రౌండ్ల కాల్పులు జరపాల్సిన అవసరం ఏంటి? కాల్పుల సమయంలో నెలకొన్న పరిస్థితులు ఏమిటో తెలియజేయాలని పిటీషన్ లో పేర్కొన్నారు. నిందితుడి కాళ్లకు బుల్లెట్ గాయాలతోపాటు ముఖంపై కూడా గాయాలు కావడంపై ఆరాతీసింది. అవి ఎలా ఏర్పడ్డాయి? వాటికి కాల్పులతో సంబంధం ఉందా? అటవీ ప్రాంతంలో పడిపోవడం వల్లే గాయాలయ్యాయన్న పోలీసుల వివరణలో వాస్తవమెంత అనే అంశాలను వైద్య, ఫోరెన్సిక్ ఆధారాలతో నిర్ధారించాలని కోరారు.గాయపడిన వ్యక్తిని తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఆస్పత్రిలోకి ఈడ్చుకెళ్లడం వల్ల అతడి గాయాలు మరింత తీవ్రం అయ్యే ప్రమాదం ఉందని.. వీటిపై విచారణ జరపాలని పిటీషన్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు.

అనంతపురం జిల్లా రాప్తాడు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అడ్డువచ్చిన మరో విద్యార్థినిపై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే.. తీవ్రంగా గాయపడిన బాలిక ప్రస్తుతం బెంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.ఈ వ్యవహారం హైకోర్టు కు ఎక్కడం.. నిందితుడి కాల్పులపై న్యాయవాది పలు ప్రశ్నలు లేవనెత్తడంతో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశమైంది.

పాపం షర్మిల.. ఇంత హర్ట్ అవుతారనుకోలేదా ..?



ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు.. వైఎస్ షర్మిల తాజాగా జరిగిన స్థానిక ఎన్నికల విషయంలో తీవ్రంగానే హర్ట్ అయి నట్టు ఉన్నారు. కాంగ్రెస్ తరఫున అభ్యర్థులు పోటీ చేసినా.. ఒకటి రెండు చోట్ల కూడా.. గెలుపు గుర్రం ఎక్కుతారని అనుకున్నా.. అందరూ చతికిల పడ్డారు. కనీసం పోటీ కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఒకచోట మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి 240 ఓట్లు తెచ్చుకున్నారు. మరో చోట 20 నుంచి 50 ఓట్ల మధ్య మాత్రమే దక్కాయి. ఈ పరిణామాలు సహజంగానే జీర్ణించుకోలేక పోయారు షర్మిల.

దీంతో కూటమి సర్కారుపై తీవ్రస్థాయిలో ఆక్రోశించారు. ''ఓట్లు మీరే వేసుకున్నారు.. గెలుపు మీదేనని ప్రకటించు కున్నారు. ఇంకా ప్రజలతో, ప్రజాస్వామ్యంతో పనేంటి ? ఎన్నికల్లో పారదర్శకత అనేదానికి విలువేంటి ? స్వేచ్ఛ, నిష్పక్షపాతం అనేదానికి అర్థం ఏంటి ?" అని ఎక్స్‌లో సుదీర్ఘపోస్టు పెట్టారు. అంతేకాదు.. ఇది ప్రజా తీర్పు కాదని తేల్చేశారు. కూటమి పార్టీల నిజమైన జయభేరి కాదని,. ప్రజల గొంతు నొక్కి, ప్రతిపక్షాలను అణచివేసి, సాధించిన బలవంతపు గెలుపగా షర్మిల అభివర్ణించారు.

షర్మిల చేసిందేంటి?

వాస్తవానికి ఇప్పుడు కూటమిపై విమర్శలు చేస్తున్న షర్మిల.. కీలక ఎన్నికల సమయంలో ఏం చేశారన్నది ప్రశ్న. ఎన్నికల వేళ కుమార్తె వివాహం ఉందన్న కారణంగా.. అసలు అభ్యర్థుల ఎంపికపైనే ఆమె దృష్టి పెట్టలేదు. అంతేకాదు.. అసలు ఈ విషయంతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నట్టుగానే ఆమె వ్యవహరించారు. కనీసం క్షేత్ర స్థాయిలో కూటమి బలాబలాలు ఎలా ఉన్నాయి? కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న మద్దతు ఎంత? ఎవరిని నిలిపితే.. గెలుస్తారు? అనే ముఖ్యమైన నాలుగు పాయింట్లను కూడా ఆమె పట్టించుకోలేక పోవడం గమనార్హం.

ఎవరికి వారే..

షర్మిల దాదాపు కాడి పడేయడంతో క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ నాయకులు కూడా ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిం చారు. ఎక్కడికక్కడ నాయకులు ఇష్టానుసారంగానే వ్యవహరించారు. ప్రజలను కలుసుకున్నది.. వారిని తమ వైపు తిప్పుకొన్నది కూడా లేదు. దీంతో కాంగ్రెస్‌కు-ప్రజలకు మధ్య దూరం పెరిగిపోయింది. మరోవైపు.. కీలక ఎన్నికల సమయంలోనే సోదరుడు జగన్‌తో జగడం పెట్టుకోవడం.. బెంగళూరు ప్యాలెస్‌ను తన కుమార్తె వివాహానికి ఇవ్వడం లేదన్న విషయాన్ని భారీ ఎత్తున హైలెట్ చేయడంతో ఇది కూడా.. షర్మిల రాజకీయాలపై మరకలు పడేలా చేసిందన్న వాదన ఉంది.ఈ నేపథ్యంలోనే ప్రజలు పూర్తిగా కాంగ్రెస్ ను మరిచిపోయారు. ఇలా సంస్థాగతంగా, వ్యక్తిగతంగా అనేక లోపాలు పెట్టుకుని.. వాటిని సరిచేసుకునేందుకు కూడా దృష్టి పెట్టని షర్మిల.. ఇప్పుడు ప్రజలు ఇచ్చిన తీర్పునకు పెడార్థాలు తీయడంలో ఔచిత్యం ఏంటన్నది కూటమిలోని కొందరు నాయకులు అడుగుతున్న ప్రశ్న. ముందు సొంత ఇంటిని చక్క బెట్టుకుని ప్రజల మెప్పు పొందాలని కొందరు సూచిస్తున్నారు.

పెన్ పవర్

గురువారం 5 నవంబర్ 2026

భారతీయులతో పెట్టుకున్నాడు.. ట్రంప్ అనుభవిస్తున్నాడు..



నువ్వు ఎవరితోనైనా పెట్టుకో కానీ.. 'బాల్య మిత్రులు' ఉన్నోడితో మాత్రం పెట్టుకోకు అని అదేదో సినిమాలో 'వేణుమాధవ్' ఓ పాపులర్ డైలాగ్ వదులుతాడు. ఇప్పుడు ఈ డైలాగ్ మన ట్రంప్ తాతకు సరిగ్గా సూట్ అవుతుంది. ఎందుకంటే ఆయన పెట్టుకోకూడని వారితో పెట్టుకున్నాడు. ఇప్పుడు అనుభవిస్తున్నాడు. ఏకంగా 30 ఏళ్లుగా రిపబ్లికన్ల కంచుకోటల్లో కూడా ట్రంప్ పార్టీ ఓడిపోయి తగిన గుణపాఠాన్ని పొందింది. దీనంతటికి కారణం ట్రంప్ వెర్రితలలతో వేసిన అడుగులు.. అహంకారపు చేష్టలు.. మాటలు.. అందుకే ఇప్పుడు అనుభవించేస్తున్నాడు..

అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికలు ట్రంప్ తాతకు కర్రుకాల్చి వాతపెట్టారు. ఈ ఫలితాలు రిపబ్లికన్ పార్టీకి ఒక కీలకమైన సందేశాన్ని పంపాయి. ముఖ్యంగా భారతీయులపై అమెరికాలో పెరుగుతున్న వ్యతిరేకత.. హెచ్1బీ వీసాల విషయంలో కొందరు మాగా మద్దతుదారులు చేస్తున్న విద్వేషపూరిత వ్యాఖ్యలు, చేష్టలు ట్రంప్ పార్టీకి రాజకీయంగా తీవ్ర నష్టం కలిగించాయని ఈ ఎన్నికలతో నిరూపితమైంది.'హౌడీ మోడీ' అంటూ గత సారి ట్రంప్ కు మద్దతుగా ఏకంగా భారత ప్రధాని ప్రచారం చేసి ఆయనకు బాసటగా నిలిచారు. అప్పుడు భారతీయ అమెరికన్లు అంతా ట్రంప్ వెంట నడిచి గెలిపించారు. కానీ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక పూర్తిగా మారిపోయాడు. అసలు పాత ట్రంప్ కు కొత్త ట్రంప్ కు తేడానే లేదు. మన శత్రుదేశం పాకిస్తాన్ తో కలవడం.. భారత్ పై 100 శాతం టారిఫ్ లు.. అమెరికాలోని భారతీయులపై వీసా సమస్యలు, హెచ్1బీ ఆంక్షలు సహా ఎన్నారైలను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించాడు. భారతీయులపై ట్రంప్ రెండో సారి అధికారంలోకి వచ్చాక వివక్ష, జాత్యహంకార వ్యాఖ్యలు, భారత్ పై వ్యతిరేక ధోరణి విపరీతంగా పెరిగాయి. అవే ఇప్పుడు ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీని చావు దెబ్బ తీశాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

అమెరికాను భారతీయులు ఎప్పుడూ దోచుకోలేదు. మన టాలెంట్ తో అమెరికాను అగ్రరాజ్యంగా నిలబెట్టారు. మనవాళ్లు బాగుపడ్డారు. అయితే భారతీయ నిపుణుల విషయంలో ట్రంప్ సర్కార్ వ్యవహరించిన తీరుతో మొత్తం ఇండియన్ సమాజం ఈసారి రిపబ్లికన్ పార్టీకి దూరమైంది. పూర్తిగా డెమొక్రాట్ల వైపు తిరిగినట్టు ఎన్నికల ఫలితాలను బట్టి అర్థమైంది.ఇక అమెరికాలో భారతీయులు కేవలం ఉద్యోగులు మాత్రమే కాదు.. వ్యాపారులుగా, వైద్యులు, ఐటీ అగ్రస్థానంలోని సీఈవోలు, విద్యావేత్తలు, పెట్టుబడిదారులు, రాజకీయ నాయకులుగా కూడా ఎదిగారు. ఇలాంటి పరిస్థితుల్లో వీరంతా ఈసారి మూకుమ్మడిగా డెమొక్రాట్ల వైపు మరలడంతో రిపబ్లికన్ పార్టీకి మరణశాసనం లిఖించినట్టైంది.

అమెరికా ఎన్నికలు సందేశం ఒక్కటే.. భారతీయులతో పెట్టుకొని ఇప్పుడు ట్రంప్, ఆయన పార్టీ అనుభవిస్తోంది. మనవాళ్ల ఇన్ఫ్లూయేన్స్, ప్రభావం.. అమెరికన్ ఓటర్లలో కూడా ట్రంప్ తీరుపై వ్యతిరేకత ప్రస్ఫుటంగా కనిపించింది. భారతీయుల కృషిని తక్కువ అంచనావేసి.. వారిపై వివక్ష చూపి అమెరికన్ల ఓట్లు కొల్లగొడుదామనుకున్న ట్రంప్ ఇప్పుడు మూల్యంచెల్లించుకున్నాడు. భారతీయులపై వ్యతిరేత చూపిస్తే వారి ఓట్లే కాదు.. అమెరికన్ల ఓట్లు కూడా దూరం అయ్యాయన్న గుణపాఠం ట్రంప్ కు ఇప్పటికైనా జ్ఞానోదయం కలిగిస్తుందో లేదో చూడాలి.

కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్.. తొలి వన్డేలో కివీస్‌పై భారత్ ఘనవిజయం

కివీస్‌తో తొలి వన్డేలో 5 వికెట్ల తేడాతో భారత్ గెలుపు

వర్షం కారణంగా లక్ష్యాన్ని 143 పరుగులకు కుదింపు

విరాట్ కోహ్లీ అద్భుతమైన 74 పరుగుల ఇన్నింగ్స్

భారత పేసర్లు అర్ష్‌దీప్, గుర్నూర్, కంబోజ్ అద్భుత ప్రదర్శన

185 పరుగులకే కుప్పకూలిన న్యూజిలాండ్ జట్టు



ఆక్లాండ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం పదేపదే అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (74) క్లాస్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.అంతకుముందు టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. భారత యువ పేస్ త్రయం అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, అన్షుల్ కంబోజ్ అద్భుతంగా రాణించారు. మేఘావృతమైన వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుంటూ కివీస్ బ్యాటర్లను ఆరంభం నుంచే ఒత్తిడిలోకి నెట్టారు. అర్ష్‌దీప్ సింగ్ 4 వికెట్లతో చెలరేగగా, గుర్నూర్ 3, అన్షుల్ 2 వికెట్లు పడగొట్టారు. వీరి దెబ్బకు న్యూజిలాండ్ జట్టు 40.2 ఓవర్లలో 185 పరుగులకే కుప్పకూలింది. కివీస్ జట్టులో ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ (38), గ్లెన్ ఫిలిప్స్ (30) కాసేపు నిలదొక్కుకునే ప్రయత్నం చేశారు. అయితే చివర్లో బ్లెయిర్ టిక్నర్ కేవలం 23 బంతుల్లో 4 సిక్సర్లతో 34 పరుగులు చేసి అనూహ్యంగా మెరిశాడు. అయినప్పటికీ కివీస్ జట్టు 200 పరుగుల మార్కును కూడా దాటలేకపోయింది.లక్ష్య ఛేదనలో టీమిండియా ఆరంభంలోనే ఒక వికెట్ కోల్పోయినా, విరాట్ కోహ్లీ తన క్లాస్ ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. వన్డే ఫార్మాట్‌లో తన 80వ అర్ధశతకాన్ని నమోదు చేసిన కోహ్లీ, మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (37)తో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. భారత ఛేదన సమయంలో వర్షం రెండుసార్లు అంతరాయం కలిగించడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి (డీఎల్ఎస్) ప్రకారం లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా సవరించారు. ఈ భాగస్వామ్యంతో భారత్ విజయం దాదాపు ఖాయమైంది. అయితే, లక్ష్యానికి చేరువవుతున్న సమయంలో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి కాస్త తడబడింది. అయినప్పటికీ, చివరకు 22.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసి సునాయాసంగా విజయాన్ని అందుకుంది.

వయసు పెరిగినా తగ్గని జోరు.. "ఇంకా 21 ఏళ్ల అమ్మాయినే అనుకుంటా" అంటున్న సింధు





వరుసగా రెండు టోర్నీల్లో ఫైనల్ చేరి మళ్లీ పూర్వపు ఫామ్ అందుకున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు.. ఇప్పుడు తన శారీరక దృఢత్వంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. డిసెంబరులో జరిగే బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు పూర్తి ఫిట్‌నెస్‌తో సిద్ధమయ్యేందుకు కొరియా ఓపెన్ సహా తదుపరి టోర్నీలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించింది. "నాకిప్పుడు చిన్న వయసు కాదు. 31 ఏళ్లు. అయినా ఇంకా 21 ఏళ్ల అమ్మాయినే అనుకుంటా" అంటూ తన ఉత్సాహాన్ని చాటుకుంది.ఇటీవల జర్మనీలో జరిగిన హైలో ఓపెన్‌లో సింధు మహిళల సింగిల్స్ టైటిల్ గెలుచుకుంది. ఈ ఏడాది ఆమె ఖాతాలో చేరిన రెండో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ ఇది. అంతకుముందు జులైలో జపాన్ ఓపెన్ సూపర్ 750లో విజేతగా నిలిచింది. 2024 డిసెంబరు తర్వాత ఆమె గెలిచిన తొలి వ్యక్తిగత టైటిల్ కూడా అదే. మొత్తంగా సింధు ఇప్పటివరకు ఏడు వరల్డ్ టూర్ టైటిళ్లు సాధించింది. ఈ సీజన్‌లో పారిస్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ ఫైనల్ చేరిన ఆమె.. ప్రపంచ నంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్ ఛాంపియన్ అన్ సెయంగ్ చేతిలో ఓడింది.సుదీర్ఘ పర్యటన తర్వాత శరీరానికి విశ్రాంతి అవసరమని భావించి కొరియా ఓపెన్, జపాన్ మాస్టర్స్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు సింధు తెలిపింది. తొలుత అన్ని టోర్నీలు ఆడాలనుకున్నా, చివరకు శరీరం మాట వినాలని భావించినట్లు చెప్పింది. వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు ముందు విశ్రాంతి తీసుకొని మరింత బలంగా కోర్టులోకి రావడమే తన లక్ష్యమని పేర్కొంది.2027 జనవరి 4 నుంచి అమల్లోకి రానున్న 3ఐ15 పాయింట్ల స్కోరింగ్ విధానంపైనా సింధు స్పందించింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న 21 పాయింట్ల విధానంతో పోలిస్తే కొత్త పద్ధతిలో ఆటగాళ్లు ఆరంభం నుంచే అప్రమత్తంగా ఉండాలని చెప్పింది. తొలి ఐదు, ఆరు పాయింట్లు కోల్పోతే ఆటలో సగం సమయం ముగిసినట్లేనని వివరించింది. ప్రత్యర్థికి సులభంగా పాయింట్లు ఇచ్చే అవకాశం ఉండదని, ప్రతి క్షణం చురుగ్గా ఆడాల్సి ఉంటుందని అభిప్రాయపడింది.

రెబల్ లుక్ లో హుమా ఖురేషి.. కుర్రాళ్లు ఏమైపోవాలి?



ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు ఒకవైపు సినిమా షూటింగ్లో బిజీగా ఉంటూనే.. మరొకవైపు గ్లామర్ తో కట్టిపడేస్తున్న విషయం తెలిసిందే. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ రోజుకో ఫోటోషూట్ తో అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు.ఇలా ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్న ఎంతో మంది సెలబ్రిటీలు ప్రముఖ మ్యాగజైన్ కవర్ పేజీలపై కూడా దర్శనం ఇస్తూ మరింత క్రేజ్ దక్కించుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రముఖ బాలీవుడ్ బ్యూటీగా మంచి పేరు సొంతం చేసుకున్న హుమా ఖురేషి తాజాగా తన అధికారిక ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. జీక్యూ ఇండియా హీరోస్ మ్యాగజైన్ కోసం ఇచ్చిన ఫోజులలో ఈమె రెబల్ లుక్ చూసి కుర్రాళ్ళు సైతం భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ ఫీబీ ఫిలో రూపొందించిన ఓవర్ సైజ్డ్ బ్లాక్ లెదర్ జాకెట్ ధరించిన ఈమె దీనికి కాంబినేషన్లో వార్డుబోర్డు ఎన్. వై.సీ.బ్రాండ్ కు చెందిన సింపుల్ అండ్ స్లీక్ లెగ్గింగ్ ధరించింది. ఈ అవుట్ ఫిట్ కి తగ్గట్టుగా అవుట్ హౌస్ జువెలరీ కలెక్షన్ నుండి వచ్చిన ఇండస్ట్రియల్ స్టైల్ మెటల్ లింక్ లాంగ్ నెక్లెస్ ధరించి తన మేకోవర్ను ఫుల్ ఫీల్ చేసుకుంది.ముఖ్యంగా జీ క్యు ఇండియా హీరోస్ ఫోటోలకు సంబంధించిన ఈ బోల్డ్ అండ్ స్టైలిష్ లుక్ సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది. మొత్తానికైతే హుమా లుక్ చూసిన నెటిజన్స్ ఈ రేంజ్ లో అందాలు ఆరబోస్తే కుర్రాళ్ళు ఏమైపోవాలి అంటూ సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా అమ్మడి అందం సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది.ప్రముఖ బాలీవుడ్ నటిగా పేరు దక్కించుకున్న ఈమె ఇండస్ట్రీలోకి రాకముందు మోడల్ గా తన కెరీర్ మొదలుపెట్టింది. 2012లో 'గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్' అనే చిత్రం ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఈమె.. హిందీతో పాటు తమిళ్,మరాఠీ, కన్నడ సినిమాలలో కూడా నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇకపోతే చివరిగా కన్నడ సినీ నటుడు యశ్ హీరోగా మలయాళ డైరెక్టర్ గీతూ మోహన్దాస్ దర్శకత్వంలో వచ్చిన కన్నడ - ఇంగ్లీషు ద్విభాష చిత్రమైన టాక్సిక్ లో ఎలిజబెత్ అనే విలన్ పాత్ర పోషించింది. ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా అనుకున్నంత స్థాయిలో ఆకట్టుకోలేదు.ఇందులో హుమా ఖురేషి తో పాటు నయనతార , కియారా అద్వానీ, రుక్మిణి వసంత్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. 1940 నాటి గోవా నేపథ్యంలో సాగే భారీ బడ్జెట్ గ్యాంగ్స్టర్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఆడియన్స్ ను ఆకట్టుకోవడంలో విఫలమయ్యింది. దీనికి తోడు హిందీలో పూజ మేరీ జాన్ అనే చిత్రంలో కూడా నటించింది. ఏది ఏమైనా ఒకవైపు వరుస సినిమాలలో నటిస్తూ.. మరొకవైపు ఇలా గ్లామర్ అందాలు ఆరబోస్తూ అభిమానులకు మరింత చేరువ అవుతోంది.





బార్బీ తరహా గులాబీ రంగు దుస్తుల్లో మెరిసిపోతున్న గేహ్నా సిప్పీ

అద్భుతమైన ఎరుపు రంగు ఫ్యాషన్ లుక్‌తో ఆకర్షిస్తున్న అతుల్య రవి

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965